Rs. 12/- per copy

UESI
ANDHRA PRADESH

# విద్యార్థి జ్వాల

Vol. 29 - No.12

October 2023



## ప్రార్థన ద్వారా
## శక్తివంతమైన జీవితం



# విజ్ఞాపన విశిష్టత

సంఘ చరిత్రలో జార్జ్ విట్‌ఫీల్డ్ అత్యంత ప్రసిద్ధి గాంచిన సువార్తికులలో ఒకడు. ఇంగ్లాండ్‌లో జన్మించిన ఈయన ఇంగ్లాండ్, స్కాట్‌లాండ్, వేల్స్, ఐర్లాండ్‌లో విరివిగా సువార్త పరిచర్య చేశాడు. ఒకసారి స్కాట్‌లాండ్‌లో సుమారు లక్షమందికి సువార్తను బోధించాడు. ఆయన బోధించేటప్పుడు తన కళ్ళవెంట కన్నీరు ఆగేది కాదు. అక్కడి ప్రజలు విచ్చలవిడి జీవితానికి అలవాటు పడ్డారు. వారికి బోధించడానికి ముందు మూడు రోజులు లేదా వారాలపాటు నేల మీద సాష్టాంగపడి కన్నీరు కారుస్తూ వారి పక్షాన వేడుకొనేవాడు. ఈయన వర్తమానాలకు ప్రజలు ఎంతో గొప్పగా కదిలించబడి ఒక్క మీటింగ్‌లోనే 10,000 మంది మారుమనసు పొందేవారు.

రోజులో ఎనిమిది నుండి పది గంటలు ప్రార్థనలో గడపనట్లయితే తాను ఆ రోజును సరైన విధంగా గడపననట్లుగా జాన్ వెల్ష్ అనే స్కాట్లాండ్ బోధకుడు భావించేవాడు. రాత్రి సమయంలో తనకు మెలకువ వస్తే తన చుట్టూ వెచ్చటి దుప్పటి కప్పుకొని మోకరించి ప్రార్థించేవాడు. ప్రార్థన కోసం ఒక వెచ్చటి దుప్పటిని అతడు ఎప్పుడూ తన పక్కన ఉంచుకొనేవాడు. అతడు నేల మీద బోర్లా పడుకొని గట్టిగా ఏడ్వడం చూసి 'ఎందుకలా ఏడుస్తున్నావు?' అని అసహనంతో ప్రశ్నించిన తన భార్యతో "అమ్మా! నేను మూడు వేల ఆత్మలకు జవాబుదారిగా ఉన్నాను. ఆ ఆత్మలు ఏ యే సమస్యల్లో ఉన్నాయో నాకు తెలియదు, వారందరి కోసం నేను ప్రార్థించ వద్దా?" అని జవాబు ఇచ్చేవాడు.

"ఈ లోకంలో పరిశుద్ధ జీవితాన్ని జీవించడానికి తీర్మానం చేసుకో. నీవు దేవునికి ఉపయోగపడడం లేదా ఉపయోగ పడకపోవడం అనేది పూర్తిగా దీనిపైనే ఆధారపడి ఉంటుంది. నీవు ప్రసంగాన్ని ఒక గంట లేదా రెండు గంటలు బోధించవచ్చు, అయితే నీ జీవితం వారమంతా బోధిస్తుంది. ఒకవేళ సాతాను నిన్ను పొగడ్తలను కోరుకొనే పరిచారకునిగానో, భోగాలను ఆశించే బోధకునిగానో, తిండిబోతు అయిన సేవకుని గానో, దురాశలకు లోనైన కాపరిగానో చేయగలిగి గాడంటే, వాడు నీ పరిచర్యను సర్వ నాశనం చేయడంలో సఫలీకృతుడైనట్లే. దానిని నువ్వు నిరోధించాలంటే నిన్ను నీవు ప్రార్థనకు సమర్పించుకో. ప్రార్థన మరియు పరిశుద్ధ జీవితం ఈ రెండు ఒక్కటే. ఈ రెండూ ఒకదానికి మరొకటి స్పందిస్తూ ప్రతిస్పందిస్తూ ఉంటాయి. ఈ రెండూ ఒకటి లేకుండా మరొకటి బ్రతకలేవు. ఎందుకనగా, ఈ రెండింటిలో ఒకటి లేదంటే, మరొకటి లేనట్లే. ప్రార్థనా అడ్డంకులు పరిశుద్ధ జీవితానికి కూడా అడ్డంకులే" అని చెబుతూ విశ్వాసులు పరిశుద్ధ జీవితం జీవించేటట్లు ప్రార్థనలో పోరాడేవాడు స్కాట్‌లాండ్ బోధకుడైన రాబర్ట్ ముర్రే మెక్‌షేన్.

జార్జ్ విట్‌ఫీల్డ్, జాన్ వెల్ష్, రాబర్ట్ ముర్రే మెక్‌షేన్ మొదలైన భక్తులందరూ గొప్ప విజ్ఞాపకులుగా ఉంటూ అప్పటి ప్రజలను, వారి దేశాల్ని ఎంతో ప్రభావితం చేశారు. మన దేశానికి, విద్యార్థుల పరిచర్యకు ఆశీర్వాద కారకులుగా ఉండాలంటే మనం కూడా వారి వలె విజ్ఞాపన చేయాలి. ఇది బైబిల్లోని భక్తుల, మన ప్రభువైన యేసుక్రీస్తు మాదిరి, ఇది మనకు ఆజ్ఞ కూడా (యోహాను 17వ అధ్యాయం, రోమా 8:34). నీతిమంతుని విజ్ఞాపన మన:పూర్వకమైనదై బహు బలము గలదై ఉంటుంది (యాకోబు 5:16).

విజ్ఞాపన అంటే ఒక విశ్వాసి-ఒక వ్యక్తి, సమాజ పక్షంగా వేడుకోవడం, వారి క్షేమంకోసం తపించడం, నాశనం జరగకుండా ప్రార్థనలో అడ్డుపడడం. అక్కరలో ఉన్న ప్రజలకు, అక్కరలను తీర్చే ప్రభువుకు మధ్య అనుసంధానకర్తగా నిలబడి, ప్రజల కొరకు ప్రార్థించడం. ఇతరుల నిమిత్తం విజ్ఞాపన చేయడం నేటి విశ్వాసులకు అంతగా అబ్బని విద్య అని అనుకోవాలి. ఎప్పుడు 'నే, నా, నావారు' అనే చట్రంలోనే ఉండిపోతూ దేవుని ఆశీర్వాదాన్ని ఇతరులకు చేరకుండా అడ్డుపడుతున్నాము. దేశానికి- దేవునికి మధ్య నిలబడి విజ్ఞాపన చేయడం ధన్యకరమైన సేవ.

విజ్ఞాపన చేసేవారు ఈ ఐదు లక్షణాలను కలిగి ఉంటారు.

1. **ప్రేమిస్తారు:** తమ పూర్ణ శక్తితో దేవునిని, తమ పొరుగువారిని ప్రేమిస్తారు. ప్రేమించినప్పుడు వారి చెడును, నాశనాన్ని చూడలేరు.
2. **స్వార్థముండదు:** తమ సమయాన్ని ప్రార్థనలో ఇతరుల కొరకు కేటాయించడం, స్వార్థం లేకపోవడమే. తన క్షేమం కన్నా ఇతరుల క్షేమాన్ని కాంక్షించేవారుగా ఉంటారు.
3. **దేవుని మనస్సు ఎరిగినవారు:** ఏ విషయాల్ని చూసి దేవుడు నొచ్చుకొంటాడో, ఏవి దేవునికి దు:ఖాన్ని కలిగిస్తాయో, ఏవి దేవుని హృదయాన్ని బ్రద్దలు చేస్తాయో విజ్ఞాపకుడు కూడా అలానే భావిస్తాడు, అదే భారాన్ని కలిగి ఉంటాడు.
4. **ప్రాణాల్ని త్యజించడానికి సిద్ధంగా ఉంటారు:** మోషే (నిర్గమ 32:32); ఎస్తేరు (ఎస్తేరు 4:16)
5. **కన్నీరు కారుస్తారు:** నెహెమ్యా, పౌలు

"దేవుని గూర్చి మానవులతో మాట్లాడడం ఒక గొప్ప కార్యమే, అయితే మానవుల కొరకు, మానవుల పక్షంగా దేవునితో మాట్లాడడం మరింత గొప్ప కార్యం" అని అంటాడు ఇయం బౌండ్స్. గనుక విజ్ఞాపన విశిష్టతను గమనిద్దాం. విజ్ఞాపన చేస్తూ, మన పరిచర్యకు, సంఘానికి మేలు చేద్దాం.

– పి. సునీల్ జాకబ్

# విద్యార్థి జ్వాల



Vol. 29, No.12 October 2023
A Publication of
UESI Publication Trust



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.



CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com



GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

November: Fear of God
December: The Uniqueness of Jesus Christ

**Note:** Please send your writeups on or before
**10th of every month**


# శక్తివంతమైన ప్రార్థన



"శక్తివంతమైన ప్రార్థన అగ్ని బలాన్ని అణచివేసింది. సింహాల క్రోధానికి కళ్ళెం వేసింది. అరాచకత్వానికి కంచెను కట్టింది. యుద్ధాన్ని మాన్పివేసింది. ప్రకృతి శక్తులను శాంతింపజేసింది. దయ్యాలను వెళ్ళగొట్టింది. మరణపాశములను తెంచివేసింది. పరలోక ద్వారాలను విశాలం చేసింది. రుగ్మతకు ఉపశమనం చేకూర్చింది. దగాకోరులను తరిమి కొట్టింది. పట్టణాలను నాశనం నుండి కాపాడింది. సూర్యుని గమనాన్ని నిలిపి వేసింది. మరియు పిడుగు యొక్క పురోగమనాన్ని అడ్డగించింది. ప్రార్థన అన్నిటికి చాలిన సర్వాంగ కవచమై, తరగని ధన నిధియై, ఎన్నటికీ తరగని గనియై, మేఘాలచేత ఆవరింపబడని ఆకాశమై, తుఫాను చేత కలవరం పొందని పరలోకమై ఉన్నది. అది వేవేల ఆశీర్వాదాలకు మూలమై, ఊటయై ఉన్నది."

– సెయింట్ జాన్ క్రిసోస్తమ్

## లోపలి పేజీల్లో...


- విజ్ఞాపన విశిష్టత - 2
- మార్పు - మంచి ముగింపు - 4
- ప్రార్థన ద్వారా శక్తివంతమైన జీవితం - 5
- వారు మోకరించి విజయం సాధించారు - 8
- ప్రార్థన లేమి పాపమే! - 11
- ప్రార్థనలో పట్టుదల - 14
- సంఘ చరిత్రలో కౌన్సిల్స్ వాటి తీర్మానాలు - 15
- హవ్వ - 18
- కుటుంబ ప్రార్థన - 21
- మార్కులా? మంచి నైపుణ్యాలా? - 24
- ఇది నాకు చాలా పర్సనల్ - 27
- కృంగిపోవద్దు - 29
- కోశాధికారి లేఖ - 31
- నా ప్రయాణం - 32

# మార్పు - మంచి ముగింపు

"మీరు వెనుకకు వెళ్ళి ప్రారంభాన్ని మార్చలేరు, గానీ మీరు ఉన్న చోట నుంచి ప్రారంభించి ముగింపును మార్చవచ్చు" అని అంటాడు గొప్ప క్రైస్తవ మేధావి సి.యస్. లూయిస్.

చాలామంది తమ ప్రస్తుత జీవితాన్ని చూసి గతంలో చక్కగా జీవించి ఉంటే, లేదా ఏదైనా పని చక్కగా ప్రారంభించి ఉంటే ప్రస్తుత పరిస్థితి చాలా బాగుండేదని నిరాశ, నిస్పృహలతో ఉంటారు. మంచి కుటుంబంలో పుట్టి ఉంటే, చిన్నప్పటినుంచి చక్కగా గైడ్ చేసే వారుంటే, అమ్మానాన్నలు మంచి సంపన్నులయితే లేదా విద్యాధికులైతే, ఉపాధ్యాయులు చక్కగా బోధించి ఉంటే, చిన్నప్పటి నుంచి మంచిగా చదువుకొని ఉంటే లేదా చక్కని క్రమశిక్షణ పాటించి ఉంటే...ఇలా చాలా విషయాల్లో గతం గూర్చి ఆలోచించి ప్రస్తుత జీవితాన్ని దుఃఖమయం చేసుకొన్నవాళ్ళు ఉంటారు. ఎవరైననూ క్రీస్తునందున్న యెడల వారు నూతన సృష్టి. సమస్తము దేవుని వలననైనవి అనే మాట ఒనేసిమును గూర్చి పౌలు ఇచ్చిన సాక్ష్యం చూస్తే స్పష్టం అవుతుంది. మన గతంతో సంబంధం లేకుండా మన గతిని మన గురువుగారు మార్చగలరు.



పారిపోయినవాడు - పరపతి, ప్రగతి సాధించాలన్నా

అపజయం పొందినవాడు - అద్వితీయ విజయాన్ని సాధించాలన్నా

ప్రభువు బిడ్డల ప్రాణాలు తీసేవాడు - ప్రభువు కొరకు, ఆయన పిల్లల కొరకు ప్రాణం పెట్టాలన్నా

ప్రయోజనం లేనివాడు - ప్రయోజకుడు కావాలన్నా

అనామకుడు - అధిరోహించాలన్నా

దొంగ - దొడ్డవాడు కావాలన్నా

విశ్వాసుల హృదయాలు - విశ్రాంతి పొందాలన్నా

వికసించిన హృదయాలు - విశేషమైన ఆదరణ పొందాలన్నా

ఇలా...ఏమి జరగాలన్నా - క్రీస్తే మన మనసులో వెలగాలి

ఆధునిక పౌలు, ఫిలేమోను, ఒనేసిములు ప్రభువు యొక్క రక్తంలోనుంచే పుట్టుకొస్తారు. చరిత్రకారుని కొరకు చరిత్ర సృష్టిస్తారు, చరిత్రలో నిలిచిపోతారు. యుఇయస్ఐ కుటుంబ సభ్యులుగా నూతన సంవత్సరాన్ని ప్రారంభించిన మనం, మన గతంతో సంబంధం లేకుండా ఉన్న చోటు నుండి ప్రారంభించి ముగింపును మారుద్దాం.

మన జీవితాన్ని తరచి చూసినప్పుడు మన ప్రారంభాలు దయనీయమైనవని గ్రహించి, ఉన్న చోటునుంచి ప్రారంభించి ముగింపును మారుద్దాం. మరో పౌలు, ఫిలేమోను, ఒనేసిములుగా మనం మన సహవాసంలో మారి - మార్పుకు మార్గదర్శకమవుదాం. మహోన్నతుని మనసులో మహా ఆనందం నింపుదాం!

ఆయన ప్రణాళికలో మీ....

**ఆర్. శ్రీనివాస్**
యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు



కవర్ కథనం

# ప్రార్థన ద్వారా శక్తివంతమైన జీవితం

## పరిచయం

క్రైస్తవ జీవితం ఒక యుద్ధం, ఒక పోరాటం. బైబిల్ బోధ ఏంటంటే, మనం నివసించే ఈ ప్రపంచం యుద్ధభూమి. మనము సాతానుతో, లోకముతో, ఇంకా విమోచింపబడని మన శరీరంతో పోరాటంలో ఉన్నాము. ఈ పాపపు ప్రపంచంలో పాపాన్ని జయించి, క్రీస్తువలే జీవించడానికి క్రీస్తు మనకు పిలుపునిచ్చాడు. ఆయనలాంటి శక్తివంతమైన జీవితాన్ని జీవిస్తూ ప్రపంచానికి ఉప్పులా, వెలుగులా ఉండాలని ఆయన ఆజ్ఞాపించాడు. అయితే బాధాకరమైన విషయం ఏంటంటే, నేటి దినాల్లో మనము బలహీనమైన క్రైస్తవ సంఘాలను, క్రైస్తవులను చూస్తున్నాము. పాపాన్ని జయించి క్రీస్తు వలె విజయవంతమైన జీవితాల్ని జీవించాల్సిన క్రైస్తవులు పాపము చేతిలో చిత్తు చిత్తుగా ఓడిపోయి బలహీనులుగా, దేవునికి ప్రయోజనం లేని వ్యక్తులుగా మారిపోతున్నారు. “నేటి క్రైస్తవ్యం ఆధ్యాత్మికమైన అనారోగ్యంతో బాధపడుతుంది” అని ఒక ప్రముఖ వేదాంతి అంటాడు. మనము యేసుక్రీస్తు లాగా, చరిత్రలో ఎంతో శక్తివంతమైన జీవితాలు జీవించిన భక్తులులాగా ఎందుకు జీవించలేక పోతున్నాము? శక్తివంతమైన జీవితాలు జీవించడానికి కావలసిన వనరులు మనకు లేవా? అంటే మనకు వనరులు ఉన్నాయి. అయితే వాటిని సరిగా ఉపయోగించుకోక పోవడం వల్లనే.

“ఆధ్యాత్మిక శక్తి లేకుండా ఆధ్యాత్మిక కార్యాలు చేయగలమని భావించినప్పుడు మనం దారి తప్పిపోతాం” అని ఏ.డబ్ల్యు.టోజర్ అంటాడు. నేడు మనకు కావలసింది ఎక్కువ జ్ఞానము, ఎక్కువ వాక్చాతుర్యం, ఎక్కువ సంస్థలు కాదు గానీ దేవుని నుండి మరింత శక్తి అని ఆర్. డబ్ల్యు. జాన్ స్టాట్ అభిప్రాయపడ్డాడు.

## విశ్వాసి శక్తికి మూలం ఎవరు?

విశ్వాసులు తమ స్వంత శక్తి లేదా వనరులతో పవిత్రంగా లేదా నీతిగా జీవించలేరు. దేవుడే విశ్వాసి యొక్క అత్యున్నతమైన శక్తి, అనివార్యమైన వనరు. “నాలో బలముగా కార్యసిద్ధి కలుగజేయు ఆయన యొక్క క్రియా శక్తిని బట్టి నేను పోరాడుచు ప్రయాసపడుచున్నాను” అని పౌలు కొలస్సీయులకు రాస్తాడు (కొలస్సీ 1:29). “నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరని” యేసుక్రీస్తు అన్నాడు (యోహాను 15:5). దేవుని శక్తి లేకుండా మనం దేవునిని సేవించడానికి ప్రయత్నించడం వ్యర్థం. ఈ లోక ప్రతిభ, శిక్షణ, అనుభవం దేవుని యొక్క శక్తి స్థానంలో ఉండలేవు. ఈ శక్తిని మనము పొందుకొనే మార్గం, అలాగే మన అనుభవములోనికి తీసుకొని వచ్చే సాధనం ప్రార్థనే.

## ప్రార్థన ప్రాధాన్యత

ప్రార్థన విశ్వాసికి ఊపిరిలాంటిది. ప్రార్థన విశ్వాసి శక్తిని పొందుకొనే మార్గం. అందుకనే ‘మీరు

ప్రార్థన చేయాలి' అని దేవుడు ఆజ్ఞాపించినట్లు లేఖనాల్లో మనము చూస్తాము. అనేకమంది విశ్వాసులు తమ విశ్వాస జీవితంలో వెనకబడడానికి, ప్రాపంచిక శోధనలను జయించలేక పోవడానికి, పాత స్వభావానికి పదే పదే తలవంచడానికి, సాతాను ముందు చిత్తు చిత్తుగా ఓడిపోయి కుప్పగూలి పోవడానికి కారణం కేవలం ప్రార్థనాలేమే. ఈ పతనమైన ప్రపంచంలో ప్రార్థన అనేది దేవుడు మనకు ఇచ్చిన మెడిసిన్ లాంటిది. ప్రార్థన దేవుని కృపను పొందుకొనే అభ్యాసం.

మీరు ప్రార్థనకు కొత్త వారు అయితే శక్తికి కూడా కొత్త వారే. రహస్య ప్రార్థనను నిర్లక్ష్యం చేయడం విశ్వాసి యొక్క బలాన్ని తినేసే మిడతలాంటిది. మనము ప్రార్థనలో బలహీనులమైతే ప్రతిచోటా బలహీనులమే. "ప్రార్థన నేర్చుకొన్నవాడు పవిత్రమైన, సంతోషకరమైన జీవితానికి సంబంధించిన గొప్ప రహస్యాన్ని నేర్చుకున్నాడు" అని విలియం లా అనే భక్తుడు అంటాడు. ప్రార్థన అనేది విశ్వాసి, సంఘము యొక్క పవర్ హౌస్‌గా చూడవచ్చు. ఎందుకంటే ప్రార్థనలో దేవుని యొక్క శక్తి ఉత్పత్తి అవుతుంది.

## ప్రార్థనకు, శక్తికి మధ్య గల సంబంధం

పౌలు జీవితాన్ని, ఆయన పత్రికలను గమనిస్తే మనము ప్రార్థన గురించిన గొప్ప సత్యాలను నేర్చుకోగలం. ఎఫెసీ 3:14-20 వచనాలలో పౌలు ఆ సంఘ విశ్వాసుల కోసం చేసిన ప్రార్థనను మనము అధ్యయనం చేస్తే, ఆధ్యాత్మిక శక్తిని పొందడానికి, ప్రార్థనకు మధ్య గల సంబంధాన్ని అర్థం చేసుకోగలము. పౌలు దేవుని దగ్గర అక్కడి విశ్వాసుల కోసం రెండు అభ్యర్థనలు చేస్తున్నాడు.

1. అంతరంగ పురుషుని యందు శక్తి కలిగి దేవుని ఆత్మవలన ఎఫెసీ సంఘం బలపరచబడాలని.
2. పరిధులు లేని క్రీస్తు ప్రేమను తెలిసికోవడానికి తగిన శక్తి గలవారు కావలెనని ప్రార్థన చేస్తున్నాడు.

ఎఫెసీ 1:18లో వారు దేవుడు యేసుక్రీస్తును లేపడానికి వినియోగించిన అపరిమితమైన శక్తిని తెలుసుకోవాలని ప్రార్థించాడు. అయితే ఇక్కడ వారి యొక్క అంతరంగ పురుషుడు బలపరచబడాలని, వారికి యేసుక్రీస్తు చేసిన కార్యము ద్వారా అందుబాటులో ఉన్న ఆ శక్తిని ఉపయోగించుకొని ఆత్మచేత బలపరచబడాలని ప్రార్థన చేస్తున్నాడు. మన ప్రవర్తనను నియంత్రించే, పరలోకానికి మనల్ని సిద్ధం చేసే మన అంతరంగ పురుషుడు లేదా స్వభావము నందు దేవుని అపరితమైన శక్తి ప్రదర్శించబడాలని పౌలు ఎంతో ఆసక్తితో ప్రార్థన చేస్తున్నాడు. పరిశుద్ధముగా జీవించడానికి, నైతికమైన సంకల్పాన్ని బలపరచే శక్తి కోసము, విధేయతతో, నమ్మకముగా ఉండడానికి కావలసిన శక్తి కోసం, యేసుక్రీస్తుకు అనుగుణంగా ఎదిగే శక్తి కోసం పౌలు ప్రార్థన చేస్తున్నాడు.. మన అంతరంగంలో దేవుని శక్తి ఎంత ఎక్కువగా పనిచేస్తే అంత ఎక్కువగా మనము పునరుత్థానుడైన క్రీస్తుకు తగిన నివాసాలుగా మారుతాము. దాని కోసం మనము ప్రార్థన చేయాలి. తద్వారా దేవుని శక్తి మన యొక్క జీవితాలలో పరిశుద్ధాత్మ ద్వారా కార్య సాధకము అవుతుంది.

పౌలు చేస్తున్న రెండవ అభ్యర్థన ఏంటంటే, క్రీస్తు ప్రేమ యొక్క అపరిమితమైన పరిధి గ్రహించగల శక్తి మనము కలిగి ఉండాలని ప్రార్థన చేస్తున్నాడు. మనం పరిపూర్ణులం కావడానికి క్రీస్తు యేసులోని దేవుని ప్రేమను గ్రహించే శక్తి మనకు ఉండాలని పౌలు కోరుకొంటున్నాడు. క్రీస్తు ప్రేమ యొక్క అపరిమిత పరిధిలు గ్రహించగలిగేటట్లు దేవుని నుండి శక్తిని పొందితే తప్ప మనం ఆధ్యాత్మికంగా పరిణతి లేదా సంపూర్ణతను సాధించలేమని పౌలు ఇక్కడ చెబుతున్నాడు. జ్ఞానానికి మించిన ఈ ప్రేమను తెలుసుకోనంత వరకు మనం ఉండాల్సిన రీతిలో పరిపూర్ణత లేదా పరిణితి సాధించలేము. అలాగే క్రీస్తులో దేవుని ప్రేమ అనుభవంలో ఎదగని క్రైస్తవుడు కూడా పూర్తి పరిపక్వతకు ఎదగలేడు. మనం క్రీస్తు ప్రేమను గ్రహించేందుకు దేవుని శక్తి కంటే తక్కువైన శక్తి సరిపోదు. మన మాటలు, మన ఆలోచనలు, మన చర్యలు, మన ప్రతిచర్యలు, మన సంబంధాలు, మన లక్ష్యాలు, మన విలువలు- అన్నీ కూడా క్రీస్తు ప్రేమ యొక్క స్వీయ-చేతన ఆనందంలో జీవించినప్పుడు మాత్రమే రూపాంతరం చెందుతాయి. ప్రార్థన అనేది వేదాంతాన్ని అనుభవముగా మారుస్తుంది. క్రీస్తు యేసులో మనకు లభించిన ఆశీర్వాదాలను పొందేందుకు దేవుడు నియమించిన సాధనం ప్రార్థనే.

పౌలు ప్రార్థనను మనము గమనించినట్లయితే

మన అంతరంగ పురుషుడు అభివృద్ధి చెందాలంటే మనకు శక్తి కావాలి. ఆ శక్తి కొరకు మనము ప్రార్థన చేయాలి. మన విశ్వాస జీవితానికి కావాల్సిన శక్తి యేసుక్రీస్తు శిలువ మరణ పునరుత్థానం ద్వారా మనకు అందుబాటులో ఉన్నది. దానిని మనము పొందుకొనే సాధనం ప్రార్థనే.

## యేసుక్రీస్తు మాదిరి

ప్రార్థనలో యేసుక్రీస్తు తండ్రిపై ఆధారపడడం అనేది ఆయనలో విధేయతను, విజయాన్ని తీసుకొని వచ్చిందని ఒక కామెంటేటర్ అన్నాడు. దేవుడు నజరేయుడైన యేసు ద్వారా అద్భుతాలను సూచక క్రియలను మీ మధ్య చేశాడు (అపో.కా 2:22). యేసు చేసిన ప్రతి కార్యము కూడా దేవుని శక్తి చేత జరిగించాడు. యేసు తండ్రి చిత్తానికి సంపూర్ణంగా అప్పగించుకొన్నాడు. ఆయన జీవితంలోని ఏ విషయాన్ని గమనించినా ఆయన ప్రార్థనాపరుడనే విషయం అర్థమవుతుంది. ఆయన బోధించడంలో, స్వస్థతలు చేసి అలసిపోయినప్పటికీ ఆయన దేవుని శక్తిని పొందడానికి ఇంకా చీకటి ఉండగానే ఆయన అరణ్యములోనికి వెళ్ళి ఒంటరిగా ప్రార్థన చేసేవాడు (మార్కు1:35). ఆయన పరిచర్య, ప్రజల అవసరాల కన్నా దేవునితో వ్యక్తిగతంగా గడపడమే తన యొక్క ప్రాధాన్యతగా జీవించి పరిచర్యను శక్తివంతముగా చెయ్యగలిగాడు, ప్రభావవంతమైన పరిశుద్ధమైన జీవితాన్ని జీవించగలిగాడు. యేసుక్రీస్తు ప్రార్థనా జీవితం, పరిచర్య విడదీయలేని రీతిలో పెనవేసుకొని ఉంటాయి. యేసుక్రీస్తు ఈ భూమి మీద జీవించినప్పుడు ఆధ్యాత్మిక పోరాటాలన్నీ ఆయన మోకాళ్ళ మీద పోరాడి జయించాడు.

## శిష్యుల ఆశ

యేసు చూపిన శక్తిని, ఆయన ఏకాంతంగా తన తండ్రితో సంభాషించే సమయం మధ్య విడదీయరాని సంబంధాన్ని శిష్యులు స్పష్టంగా చూశారు కాబట్టే వారు మాకు బోధించడం నేర్పించమని గానీ, చనిపోయినవారిని లేపడం, నీళ్ళమీద నడవడం నేర్పించు అని అడగలేదు గానీ నీలా ప్రార్థన చేయడం నేర్పించు (లూకా11:1) అని అడిగారు. ఎందుకంటే ఆయన శక్తివంతమైన జీవితానికి రహస్యం ప్రార్థనే అని వారు గుర్తించారు. అందుకనే వారు అలాంటి జీవితాలు కావాలని కోరుకొన్నారు.



## శిష్యుల మాదిరి

ప్రార్థన వాళ్ళ చేతిలో ఆయుధం. ఆటంకాలన్నిటినీ దానితోనే ఛేదించుకుంటూ ముందుకు వెళ్ళారు. వాళ్ళ ప్రార్థనతో భూమి కంపించడమే కాదు యెరుషలేములో ప్రకంపనలు మొదలయ్యాయి. పళ్ళు బయట పెట్టి లోకం వాళ్ళని భయపెట్టినప్పుడు ప్రార్థనా గదిలోనే వాళ్ళు ధైర్యాన్ని పోగుచేసుకున్నారు. వాళ్ళు ప్రారంభించిన విమోచనోద్యమానికి ప్రార్థనే ఇంధనం అయ్యింది. ప్రార్థనే వాళ్ళ హృదయ స్పందనలకు ప్రాణవాయువు అయ్యింది. మతసాంప్రదాయ పునాదుల్ని ప్రార్థనతో పెకళించారు. శత్రుసామ్రాజ్యాన్ని ప్రార్థనతోనే పడద్రోశారు. గెత్సెమనే తోటలో రక్తబిందువుల మధ్య ప్రభువు సాతానుని ఓడించిన వైనం వాళ్ళ మనస్సుల్లో ముద్రించుకుపోయింది. ఏ యుద్ధాన్నైనా ప్రార్థనతోనే గెలవాలని వాళ్ళకి అర్థమైపోయింది. ఆశ్చర్యం లేదు, లోకం తోకముడిచింది.

## ముగింపు

పరిశుద్ధులను తయారుచేసేది ప్రార్థనా శక్తే. నిజమైన ప్రార్థనా శక్తిలో నుండే పరిశుద్ధమైన వ్యక్తుల రూపకల్పన జరుగుతుంది. దేవునితో ఆయన రహస్య సంభాషణ సమయంలోనే యేసుక్రీస్తు జీవితం రూపుదిద్దుకొంది. కాబట్టి మన ప్రార్థనా గదుల్లో మన సమయాన్ని పొడిగించినప్పుడు, మన ప్రార్థనలను తీవ్రతరం చేసినప్పుడు, క్రీస్తులాంటి భావావేశాలు, క్రీస్తు సారూప్యం మనలో ప్రదర్శితమవ్వడం వింతైన విషయమేమి కాదు. దానికోసం మనం ప్రార్థనా పాఠశాలలో ప్రార్థనా పాఠాలను క్రీస్తును పోలి అభ్యసించేందుకు తీర్మానించుకొని, సర్వశక్తుడైన దేవుని ముందు మన అశక్తతను అంగీకరిస్తూ ఆయనపై ఆధారపడడాన్ని నూతనంగా నేర్చుకొందాం.

– డా. పి. నాసరయ్య, వైజాగ్

## వారు మోకరించి

# విజయం సాధించారు

మనదేశంలో గొప్ప ఉజ్జీవ జ్వాలల్ని రేపే గొప్ప ఆత్మీయ మేల్కొలుపు మన దేశానికి అవసరం. మన ప్రజలు దేవునిని చాలావరకు మరిచిపోయారు. పాపం, హింస, నేరాలు, మతోన్మాదం ప్రజల్ని నాశనం చేస్తున్నాయి. మన సాహిత్యం, భాష, సోషల్ మీడియా, ప్రింట్ మీడియాలు కలుషితమై పోయాయి. దేవుని గూర్చి తెలుసుకోవాలనే ఆసక్తి విద్యార్థుల్లో కనుమరుగవుతుంది. సంఘాలకు వెళ్తున్న వారు కూడా దైవభక్తి లేక విచ్చలవిడి జీవితాల్ని జీవిస్తున్నారు. ఇలాంటి సమస్యలన్నిటినీ పరిష్కరించాలంటే పట్టుదలతో, పవిత్ర జీవితంతో కూడిన ప్రార్థనా భారం ఎంతో అవసరం.

### చరిత్రలో ప్రార్థనా పరులు


డేవిడ్ లివింగ్‌స్టన్, జాన్ నాక్స్, జాన్ వెస్లీ, మార్టిన్ లూథర్ లాంటి వాళ్ళంతా శక్తివంతమైన దైవజనులే గానీ అనేక విషయాలలో వారు అసంపూర్ణులు అయినప్పటికీ దేవుడు వారందరినీ గొప్పగా వాడుకొన్నాడు.

చీకటి ఖండమైన ఆఫ్రికాకు సువార్త వెలుగును తీసుకెళ్ళిన డేవిడ్ లివింగ్‌స్టన్ సాధారణ మానవుడే గాని, ఆఫ్రికా ప్రజల రక్షణ కోసం, వారి మార్పుకోసం దేవుని సన్నిధిలో పోరాడాడు, వారి మధ్య క్రీస్తువలె జీవించాడు. తన చివరి క్షణాల్లో కూడా మోకాళ్ళపై ప్రార్థిస్తూ మరణించిన ఒక గొప్ప ప్రార్థనాపరుడు.

జాన్‌నాక్స్ ఒక కఠినుడు, ఎవరికీ లొంగని నాయకుడు. గానీ, అతడు స్కాట్‌లాండ్ కొరకు మోకాళ్ళపై పోరాడి ఆత్మీయ యుద్ధాన్ని గెలిచాడు. రాత్రంతా నేలమీద మోకరించి రోదిస్తూ, “ఓ దేవా, నాకు స్కాట్‌లాండ్‌ను ఇవ్వు, లేదా నా ప్రాణాన్ని తీసుకో” అని ప్రార్థించేవాడు. స్కాట్‌లాండ్‌ను రక్షించింది అతని ప్రసంగాలు లేదా అతని ప్రయాస కాదుగాని, కేవలం అతని ప్రార్థనలే.

జాన్‌వెస్లీ కుటుంబ జీవితం అంత సంతోష కరమైనదేమి కాదు. అశాంతి, అసమాధానాలతో నిండిన ఒక విషాదాల సుడిగుండం. అలాంటి వాతావరణంలోనూ, పరిస్థితుల్లోనూ అతడు తన పరిచర్యను చేయగలిగాడంటే కారణం ప్రార్థనే. జాన్‌వెస్లీ హృదయ పరిశుద్ధత కలిగి ఇంగ్లాండ్ దేశాన్ని దేవుని కొరకు తలక్రిందులు చేశాడు. అతడు ప్రతిరోజూ అనేక చోట్ల బోధిస్తూ రోజుకు 60 నుండి 70 మైళ్ళు గుఱ్ఱంపై ప్రయాణం చేసేవాడు. అలా అతడు 54 సంవత్సరాలు సంవత్సరానికి ఇంచుమించుగా 5,000 మైళ్ళు ప్రయాణంచేస్తూ, మొత్తం 2,90,000 మైళ్ళు ప్రయాణం చేశాడు.

వెస్లీ ఇంగ్లాండ్‌ను ఎంతగా మార్చగలిగాడంటే, అతని పరిచర్య ఫలితంగా ఆ దేశం ఫ్రెంచి విప్లవం వంటి దాన్ని పునరావృతం కాకుండా తప్పించుకొందని చరిత్రకారులు అతని పరిచర్యను పొగిడారు. జాన్ వెస్లీ కూడా అందరు మానవమాత్రుల వలె ఎన్నో



తప్పులు చేశాడు. అయితే, అతడు తన పరిచర్యలో గొప్ప ఫలితాలను చూడగలిగాడు. కారణం, జాన్ వెస్లీ గొప్ప ప్రార్థనాపరుడు. అతడు ఇలా చెప్పేవాడు "దేవుడు సమస్తాన్నీ ప్రార్థనకు జవాబుగానే చేస్తాడు, ప్రార్థన లేకుండా ఆయన ఏ కార్యాన్నీ చేయడు" జాన్ వెస్లీ గురించి అతని సమకాలీనుడైన ఒక వ్యక్తి ఇలా చెప్పాడు: "తన మిగతా పనులన్నిటికంటే ప్రార్థనను అతడు అత్యంత 'ప్రాముఖ్యమైనదిగా' ఎంచాడు. అతడు ప్రకాశిస్తోన్న ముఖంతో తన ప్రార్థనాగది నుండి వెలుపలికి రావడాన్ని నేను కళ్ళారా చూశాను. వెస్లీ ప్రతిదినం రెండు గంటలు ప్రార్థనలో గడిపేవాడు".

ఉక్కుమనిషి మార్టిన్ లూథర్ కూడా ఒక బలహీనుడైన మానవమాత్రుడే గానీ, గొప్ప ప్రార్థనాపరుడు. ఒకసారి ఇలా చెప్పాడు "నా ప్రార్థనలు సాతానుకంటే శక్తివంతమైనవని నేను చెప్పగలను. అలా కానట్లయితే ఈ లూథర్ ఎప్పుడో యుద్ధభూమి నుండి ఓటమితో వెనుదిరిగి పరుగులు తీసి ఉండేవాడే. దేవుడు నా పక్షంగా చేసిన అద్భుత కార్యాలు మానవ మాత్రులు చూడలేరు, గుర్తించలేరు కూడా. అయినప్పటికీ, నా జీవితంలో ఒక్కరోజు నేను ప్రార్థనను నిర్లక్ష్యం చేసినట్టయితే, నేను విశ్వాసంలో చల్లబడిపోతాను." ప్రతిరోజు వేకువ జామున తన శ్రేష్టమైన మూడు గంటల సమయాన్ని ప్రార్థనలో గడిపేవాడు.

దేవుని కొరకు గొప్ప కార్యాలు చేసిన వారందరూ మన వంటి మానవ మాత్రులే, అయితే వారు ప్రార్థనా శిఖరాలను అధిరోహించినవారు, వారు ప్రార్థనా లోతుల్లోకి వెళ్ళినవారు. మన ప్రార్థన కంటే మనం ఎన్నటికీ గొప్పవారం కాలేము, ప్రార్థన లేకుండా మనం ఏ గొప్ప పనిని సాధించలేము. మనం దేవునితో నడచినప్పుడు, మన ప్రార్థనలో దేవునితో నిరంతర సహవాసం కలిగి ఉన్నప్పుడు, మనం ఆయనకోసం గొప్ప కార్యాలను చేయగలం. గొప్ప ప్రార్థనాపరులైన అనేక దైవజనులు చాలామంది ఈ లోకానికి తెలియని అనామకులుగానే మరణించారు, అయితే వారు ఆయనకు సుపరిచితులు, ఆయనతో సహవాసం చేశారు, ఆయనతో నడిచారు, తమ ప్రార్థనలతో ఈ లోకాన్ని కదిలించారు. మనం కూడా దేవునికొరకు గొప్పకార్యాలు చేయాలంటే ప్రార్థించాల్సిందే.

## బైబిల్లోని ప్రార్థనా పరులు

దేవుడు జవాబు ఇచ్చేవరకు ఇతరుల క్షేమము, వారి అవసరాలు, ఆత్మరక్షణ కొరకు ప్రార్థన చేయాల నే బలమైన ప్రేరణను ప్రార్థనా భారం అంటాం. ఈ ప్రార్థనా భారం కలిగి ప్రార్థన చేసి జవాబులు పొంది, సమాజాన్ని ప్రభువు కొరకు ఎలా గెలిచారో వారి ప్రార్థనా ప్రభావ ఫలితాలను కొన్నింటిని చూద్దాం.

**అబ్రహాము** తన బిడ్డల క్షేమం కొరకు, తన ఇంట పుట్టి, లోతును విడిపించిన 318 మంది వీరులకొరకు ప్రార్థన చేయటమే కాకుండా వారి కి ప్రార్థన అవసరాన్ని నేర్పించాడు. విశ్వాసులకు తండ్రిగా మొదట తన గృహాన్ని ప్రార్థనా గృహంగా తీర్చి దిద్దుకొన్నాడు. ప్రార్థనల ద్వారా నిరంతరం దేవునితో సంబంధం కలిగి ఉండబట్టే దేవుడు అబ్రహామును తన స్నేహితునిగా పిలవడానికి ఇష్టపడ్డాడు. యోబు కూడా నిత్యము తన బిడ్డల కొరకు దహన బలి, ప్రార్థనలు అర్పించాడు. కాబట్టి మనం కూడా ప్రార్థనా గృహాలను ఏర్పరచుకొని మన బిడ్డల రక్షణ, సంరక్షణ కొరకు ప్రార్థన చేద్దాం (ఆది 18:19; 14:14).

**మోషే** ఆరు లక్షల పాదాచారులను అరణ్య మార్గమున 40 ఏండ్లు నడిపించాడు. వారి ఆల నాపాలన చూసుకున్నాడు. వారికి కావాల్సిన ఆహారపానీయాలు సమకూర్చుకొన్నాడు. ఇశ్రాయే లీయులకు దశ, దిశ నిర్దేశించాడు. లోబడని ప్రజల కొరకు, వారి జీవిత మనుగడ మరియు వారి అభివృద్ధి కొరకు నిత్యం ప్రార్థించాడు. వారి అరణ్య యాత్రలో సమస్యలెన్ని ఎదురైనా వాటికోసం ప్రార్థన చేసి పరిష్కారం పొందేవాడు. ఒక సందర్భంలో నీ గ్రంథంలో నుంచి నా పేరు తుడిచివేయుము అని తెగించి ఇశ్రాయేలీయుల కొరకు ప్రార్థించాడు. మనం తోటివారి జీవిత మనుగడ, అభివృద్ధి కొరకు మోషేను పోలి ప్రార్థన చేద్దాం (సంఖ్యా 11:21; 14:19; నిర్గమ 32:32).

**సమూయేలు** జీవించిన కాలంలో ప్రతివాడును తన ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ వచ్చాడు. దేవుని యెడల భయం బొత్తిగా లేదు. సమాజంలో నీతి న్యాయాలు అడుగంటాయి. ఆ పరిస్థితులలో తాను వారి నిమిత్తం ప్రార్థన చేయకపోతే పాపం చేసినట్లు



భావించి, ప్రజల కొరకు ప్రార్థించాడు. మిస్పాకు రండి, ప్రార్థన చేస్తాను. మనమంతా కలిసి ప్రార్థన చేద్దాం అని చెప్పి ప్రజలందరు ప్రార్థన ప్రభావాన్ని గుర్తించేలా చేశాడు. గనుక మనం ప్రజలు నీతి, న్యాయాలను, చట్టాన్ని గౌరవించేలా, ఆజ్ఞలను పాటించేలా ప్రార్థన చేద్దాం.(1 సమూ 7:5,9; 12:23).

**రాజులైన దావీదు, ఆసా, హిజ్కియా** మొదలైన వారు ప్రార్థించడం ద్వారా ప్రజలకు మంచి పరిపాలన అందించారు. శత్రురాజులు యుద్ధానికి వచ్చినప్పుడు 'రండి ప్రార్థన చేద్దాం' అని రాజులు మొదలు సామాన్యుల వరకు యెహోవా సన్నిధికి వెళ్ళి ప్రార్థించి, విజయాలు సాధించారు. దేశంలో మంత్రులు, అధికారులు మంచి పరిపాలన అందించే విధంగా మనం కూడా ప్రార్థన చేద్దాం.

**యెషయా, యిర్మియా** మొదలైన ప్రవక్తలు దేవుడు వారికి బయలుపరచినవి ప్రజలకు తెలియజేస్తూ దివారాత్రులు ఏడ్చి, ప్రలాపించి ప్రార్థించేవారు. ప్రజలను దేవుని తట్టు తిరగమని హెచ్చరిస్తూ తల జలమయముగాను, కన్ను కన్నీటి ఊటగాను మారేంతగా ప్రార్థించారు. మనం కూడా సాతాను చెరలోనున్న ప్రజల విడుదల, విమోచన కొరకు ప్రవక్తల వలె ప్రార్థన చేద్దాం.

**ఎజ్రా, నెహెమ్యా, ఎస్తేరు, దానియేలు** ప్రార్థనను ఆయుధంగా చేసుకొని పతనమైన జీవితాలను కట్టారు. కూల్చబడిన గోడలను తిరిగి నిర్మించారు. మరణపు కోరల్లో చిక్కుకొన్న ప్రజానీకాన్ని రక్షించారు. జీవితంలో రాజీపడకుండా శరీరాలను అప్పగించి రాజ శాసనాలు కొట్టివేసేలా చేశారు. సమాజాన్ని సంస్కరించారు. వారు చేసిన ప్రార్థనలకు రాజులు, అధికారులు తలొగ్గేలా చేశారు. కాబట్టి, దేవుని ప్రజల కాపుదల, సంరక్షణ, సంస్కరణల కొరకు మనం కూడా ప్రార్థన చేద్దాం.

**యేసయ్య** ప్రతి విషయంలోను, అన్ని సందర్భాలలోను ఆరంభం నుంచి ఆఖరి వరకు చివరి శ్వాస విడిచే వరకు ప్రార్థించారు. యేసయ్య ప్రార్థనా జీవితాన్ని అర్థం చేసుకున్న ఏ.బి. మాసిలామణిగారు "ఇల బ్రతుకంతయు ప్రార్థన ప్రభుయేసునకు" అని పాట రాసి ఆయనను కీర్తించాడు. ఈ భువిలోనే కాదు, నేడు ఆ దివిలో కూడా ప్రస్తుతం మన కొరకు ప్రార్థన చేస్తున్నాడు యేసయ్య. శోధనలో ప్రవేశించకుండా మెళకువగా ఉండి ప్రార్థన చేయుమని హెచ్చరించాడు. అవునా? గనుక సర్వమానవాళి రక్షణ కొరకు ప్రార్థన చేద్దాం.

**యేసయ్య శిష్యులు** భూలోకమును తలక్రిందులు చేసేవారిగా, అద్భుతాలు చేసే అపొస్తలులుగా, ప్రపంచపు నలుదిక్కులకు సువార్తను మోసుకెళ్ళిన వారిగా ప్రసిద్ధిచెందారు. వారి జీవిత రహస్యం ఒక్కటే – ప్రార్థన, ప్రార్థన, ప్రార్థన. ఎల్లప్పుడు విసుకక నిత్యం ప్రార్థించేవారు. వారు చేసిన కార్యాలు ప్రార్థనా కార్యాలే. మీ కోసం ప్రార్థిస్తున్నాం, మా కోసం కూడా ప్రార్థించండి అని ఉత్తరాలు రాసేవారు. ప్రార్థనయే వారి నాడి, వేడి, వాడి. గనుక, మనం కూడా సువార్త నలుదిక్కులా ప్రచురించబడేలా ప్రార్థన చేద్దాం.

**యుఇయస్ఐ సెల్‌గ్రూప్స్** ప్రతి హాస్టల్లో, కాలేజీల్లో ఏర్పడి, ఆ కాలేజీ విద్యార్థుల కొరకు ప్రార్థన చేసేవారు. విద్యార్థి పరిచర్య ప్రారంభ దినాల్లో ప్రతి ఒక్కరం హాస్టల్ టెర్రస్‌పైకి వెళ్ళి ప్రార్థించేవారం. సెల్‌గ్రూప్స్‌గా ఏర్పడి ప్రార్థనలు చేసిన తర్వాత బైబిల్ స్టడీస్ ప్రారంభించేవారమని దీనబంధుగారు చెప్పారు. విద్యార్థుల మధ్య జరుగుతున్న యుఇయస్ ఉద్యమ రహస్యం ముమ్మాటికీ ప్రార్థనయే. "ఆత్మల కోసం ప్రార్థన అనేది మన రహస్య సేవ, దీనికి ప్రజాదరణ లేదు" (యుఇయస్ఐ హ్యాండ్‌బుక్). కాబట్టి, క్రీస్తునామమెరిగిన, ఎరుగని విద్యార్థుల కొరకు మోకరించి ప్రార్థన చేద్దాం.

## ముగింపు

ప్రార్థన వ్యక్తులను, సమాజాన్ని, దేశాన్ని ప్రభావితం చేస్తుందనుటకు ఉదాహరణగా కొన్ని చరిత్రలో, బైబిల్లో సంఘటనలను మనం చూశాం. ఈ దృష్టాంతాలద్వారా మనము బోధను పొంది (రోమా 15:4), బుద్ధి కలిగి (1 కొరింథీ 10:11) ప్రార్థన చేయడానికి ప్రోత్సహించబడతారని నమ్ముచున్నాను. మన ముందున్న ఈ మాదిరిని అనుసరిస్తే అద్భుతాలను చూడగలము.

**– ఆర్. ప్రభుదాస్,** తెనాలి



# ప్రార్థన లేమి పాపమే!

*"ప్రార్థన లేని వ్యక్తి దుష్టుని దయలో ఉంటాడు,*
*ప్రార్థన లేని కుటుంబం, పరిస్థితుల దయలో ఉంటుంది,*
*ప్రార్థన లేని సంఘము ఓటమి పాలవుతుంది"*

హడ్సన్ టేలర్ తన మిషనరీ పనిని ప్రారంభించడానికి చైనాకు ప్రయాణిస్తున్నప్పుడు, అతని ఓడ చాలా ప్రమాదంలో పడి నరమాంస భక్షకులు నివసించే ద్వీపాలకు దగ్గరగా ఉన్న మునిగిపోయిన దిబ్బల వైపుకు వెళ్తుంది. ఓడ నావికులు అనేక ప్రయత్నాలే చేసినా ఫలించలేదు. చివరికి కెప్టెన్ వచ్చి హడ్సన్ టేలర్‌తో "మేము చేయగలిగినదంతా చేశాము, ఇక ఏమి చేయాలో తోచడంలేదు" అని చెప్పాడు. అప్పుడు హడ్సన్ టేలర్ "లేదు, మేము చేయని పని ఇంకా ఒకటి ఉంది." అని చెబుతాడు. "అది ఏంటి?" అని కెప్టెన్ ప్రశ్నించాడు. "ఓడలో ఉన్న వారిలో నలుగురు క్రైస్తవులం ఉన్నాం. మేము దేవుని సహాయం కోసం ప్రార్థిస్తాం" అని విశ్వాసంతో ఓడను ప్రమాదం నుంచి తప్పించమని ప్రార్థించారు. నిమిషాల వ్యవధిలో గాలి వీచడం ప్రారంభమై అది వారిని సురక్షితంగా గమ్యానికి తీసుకువెళ్ళింది.

మన ప్రార్థనలు పరలోకంలో ఉన్న మన ప్రేమగల తండ్రి హృదయాన్ని తాకుతాయని, మనం ఆయనకు మొరపెట్టినప్పుడు ఆయన విని జవాబిస్తాడనే విశ్వాసంతో మనం ఎల్లప్పుడూ ఉండాలి. చాలాసార్లు మనం అన్నిటికీ సమయాన్ని కేటాయిస్తాము గానీ ప్రార్థనకు అసలు సమయమే ఉండదు. స్వశక్తితో పనుల్ని చేయడానికి పూనుకొంటాము గానీ దేవుని సహాయాన్ని, సన్నిహిత సహవాసాన్ని కోరుకోము.

ప్రార్థన దేవునితో మాట్లాడే అద్భుతమైన అవకాశమని మన అందరికి తెలుసు. వాక్యం మనం ఎలా ఉండాలో తెలియజేస్తే, ప్రార్థన అలా ఉండటానికి సహాయపడుతుంది. వాక్యం మనల్ని స్థిరపరిస్తే, ప్రార్థన మనల్ని బలపరుస్తుంది. ప్రార్థన సమృద్ధిని గూర్చి ఎరిగిన విశ్వాసులంగా "ప్రార్థన లేమి" తెచ్చే నష్టాల్ని గురించి నేర్చుకోవడం కూడా అవసరమే!

సమూయేలు మాటల్లో చెప్పాలంటే... "మీ కొరకు ప్రార్థన చేయడం మానితే దేవుని దృష్టికి పాపం చేసిన వాడినే" అని అంటాడు (1 సమూ 12 :23). మరో భక్తుడు "ప్రార్థన లేని వ్యక్తి దుష్టుని దయలో ఉంటాడు, ప్రార్థన లేని కుటుంబం, పరిస్థితుల దయలో ఉంటుంది, ప్రార్థన లేని సంఘము ఓటమి పాలవుతుంది" అని అంటాడు.

## ప్రార్థన లేమి అంటే ఏంటి?

ప్రార్థన లేమి అంటే అసలు ప్రార్థన చేయకపోవడం కాదు కానీ, చేయవలసినంత చేయకపోవడం, చేయవలసిన రీతిలో చేయకపోవడమే.

### 1. చేయవలసినంత చేయకపోవడం

జార్జ్ ముల్లర్ అనే దైవజనుడు "ప్రార్థన తక్కువగా చేస్తున్నావు అంటే ప్రార్థన అంటే నీకు ఆసక్తి లేనట్లే" అని అంటాడు. అందుకే పౌలు "ఎడతెగక ప్రార్థన చేయమని" థెస్సలొనీక సంఘాన్ని హెచ్చరించాడు (1 థెస్స 5:15).

### విసుగక, నిత్యము ప్రార్థన చేయాలి

1. విసుగక నిత్యము ప్రార్థన చేయుచుండవలె నని ప్రభువు చెప్పిన ఉపమానంలో ఆ స్త్రీ విశ్వాసము కాలానికి పరిమితం కాలేదు, అవరోధాలని అధిగమించి సాధించుకొంది (లూకా 18:1-8).
2. అటువలె మీరును అడుగుడి, మీకియ్యబడును; వెదకుడి, మీకు దొరకును; తట్టుడి, మీకు తీయబడును. అడుగు ప్రతివానికి ఇయ్యబడును, వెదకువానికి దొరకును, తట్టు వానికి తీయబడునని మీతో చెప్పుచున్నాను (లూకా 11:9,10). ఈ వాగ్దాన నేపథ్యం కూడా ప్రార్థనలో విసుగుదల ఉండకూడదు అని తెలియజేస్తుంది.
3. బర్తిమయి అను గుడ్డి భిక్షకుడు ప్రభువుకు మనవి చేస్తుంటే అనేకులు నిరుత్సాహ పరిచినా, అవరోధాలను అధిగమించి ప్రార్థించడం మనం గమనిస్తాం (మార్కు 10:46-52).
4. మన ప్రభువు పరిచర్యలో ఎంతో అలసిపోయినా ప్రార్థనకు ఏకాంత సమయాన్ని అనుకూల పరచుకున్నాడు (మత్తయి 14:22,23).

   విశ్వాస యాత్రలో పోరాటాలు ఎంత సహజమో విసుకక, ఎడతెగక, పట్టుదలతో ప్రార్థించడం అంతే అవసరం.

### 2. చేయాల్సిన రీతిలో చేయకపోవడం

1. ప్రార్థన చేయునప్పుడు వేషధారులవలె ఉండవద్దు అని, వ్యర్థమైన మాటలు వచింపవద్దని ప్రభువు మత్తయి సువార్త 6:5-7 వచనాలలో చెప్పిన మాటలు ఎంతైనా అనుసరణీయం.
2. అడిగేవి పొందియున్నామని నమ్మక పోవడం (మార్కు 11:24).
3. విరోధులను క్షమించకుండా ప్రార్థించడం (మార్కు 11:25).
4. మెలకువగా ఉండి ప్రార్థించకపోవడం (మార్కు 13:33).
5. సామూహిక ప్రార్థనలో ఏకీభవించలేకపోవడం (మత్తయి 18:19).

## ప్రార్థన లేమి గలవారి లక్షణాలు

### 1. ప్రార్థనను స్వార్థానికి పరిమితం చేయడం

మనం చాలా సార్లు అవసరం వచ్చినప్పుడే ప్రార్థన చేస్తాము. ఉదా: సమ్సోనును దేవుడు ఒక ఉద్దేశానికి నాయకుడిగా నియమించాడు. కానీ అతని జీవితంలో రెండు సార్లే ప్రార్థించినట్లు చూస్తాము: దాహంగా ఉన్నప్పుడు, పగ తీర్చుకొనేటప్పుడు (న్యాయాధిపతులు 15:18,19, 16:28,30). తన వ్యక్తిగత అవసరాలకే గాని ప్రజల క్షేమం కోసం ప్రార్థించిన దాఖలాలు లేవు.

### 2. ప్రభువు పిలుపును మరిచే ప్రమాదం ఉంది

లూకా 9:28-36 వచనాలలో (రూపాంతరపు సందర్భం) ప్రార్థన చేయడానికి ప్రభువుతో వెళ్ళిన పేతురు టీమ్ వెళ్ళిన పనిని పక్కన పెట్టి నిద్రించడం, తద్వారా అవకాశాలు కోల్పోవడమే గాక పేతురు తన సొంతనిర్ణయాలు చేస్తాడు, ప్రభువుతో ప్రవక్తల ను సమానం చేస్తాడు. తమ పిలుపు ఉద్దేశాలు మరిచిపోవడం లాంటి లక్షణాలు బయటపడ్డాయి.

### 3. మనుషుల సంతోషమే ప్రార్థన పరమావధిగా అవుతుంది

మత్తయి 6:5 మనుషులను సంతోషపరిచే వేషధారణ ప్రార్థన, మత్తయి 6:7 వ్యర్థమైన పదాలను విస్తరించి మాట్లాడడం, మనుషులు ఇష్టపడే పదజాలం ఉపయోగి ంచడం, కొన్ని పదాలను పదే పదే వల్లెవేయడం, మనమేదో ఆత్మచేత నింపబడ్డాం అని చూపించే ప్రయత్నాలు, ఊగడాలు, ఎగరడాలు ఇవన్నీ మనుషులు మెచ్చుకోవచ్చేమో గాని ప్రభువు అంతరంగాన్ని చూసి ప్రతిఫలమిస్తాడని గమనించాలి.

### 4. ఇతరులతో పోల్చుకొంటూ తృణీకరిస్తూ అతిశయిస్తూ ప్రార్థించడం - లూకా 18:9 -14

ప్రార్థనలో నీవు ఏమిచేశావో చెప్పడం కాదు - నీవేమైయున్నావో అది చెప్పడం కావాలి. నీతి

మంతుడిగా చెప్పుకోవడం కన్నా నీతిమంతునిగా తీర్చబడడం ముఖ్యం.

## ప్రార్థన లేమి వల్ల కలిగే నష్టాలు

**1. శిక్షకు గురయ్యే ప్రమాదం ఉంది (లూకా సువార్త 20:45-47)**

యేసు ప్రభువు శాస్త్రుల ప్రార్థన గురించి జాగ్రత్త పడమన్నారు. కారణం వారి ప్రార్థన శిక్షకు గురైంది. ఎందుకంటే వారు బాహ్యంగా కనబడేదానికి, స్థానాలకు, ఆస్తులకు ప్రాధాన్యతను ఇస్తూ మాయవేషంతో దీర్ఘ ప్రార్థనలు చేస్తారు.

**2. విశ్వాసిని బలహీనపరుస్తుంది (మార్కు 14 :37,38)**

విపత్కర పరిస్థితిని ఎదుర్కోబోయే సమయంలో ప్రార్థన చేయకపోవడం పేతురును అత్యంత బలహీనతలోనికి నెట్టింది. 68-71 వచనాలను గమనిస్తే... అలవోకగా అబద్ధాలు నోటివెంట వచ్చాయి, పిరికితనం ఆవహించింది, ప్రాణభయం వెంటాడింది.

**3. పరిచర్యను తొట్రుపాటుకు గురిచేస్తుంది (1 దిన 15:13)**

దేవునికి ప్రార్థించకుండా ప్రణాళికలు వేసుకోవడం, అమలు జరపడం, అంతా బాగానే ఉంది అనుకుంటాం. కానీ చివరకు భయాందోళనలతో పరిచర్య ముగుస్తుంది. ఉజ్జా మరణంతో కొంతకాలం స్తబ్దత ఏర్పడింది. 1 దిన. 15 :13 ప్రకారం మనము మన దేవుడైన యెహోవా యొద్ద విధిని బట్టి విచారించలేదు అని తన తప్పిదాలు దావీదు ఒప్పుకొంటాడు.

**4. పాపంతో ప్రార్థన చేస్తే దేవుడు వినడు (కీర్తన 66:18)**

హృదయములో పాపమును లక్ష్యం చేస్తే దేవుడు మన మనవి వినడు అని ఎరిగిన దావీదు సరిచేసుకొన్నాడు. మన సహవాసంలో ఈ విషయంలో గూర్చి జాగ్రత్తపడాలి.

"పై విషయాలలో మనం ఎక్కడ తప్పిపోయినా మన ప్రార్థన ప్రభువు వద్దకు చేరకపోవచ్చు "

## ప్రార్థన ఉజ్జీవాన్ని కలుగజేస్తుంది

మనచుట్టూ ఉన్నవారి కొరకు విజ్ఞాపన చేస్తే వారిలో ఆత్మీయ మేలుకొలుపు వస్తుంది. మనచుట్టూ ఉన్న అశాంతి పరిస్థితులకు దేవుని బిడ్డలలో ఉన్న ప్రార్థన లేమే కారణము (1 తిమోతి 2:1,2). తప్పుడు బోధలు వ్యాపించడానికి, అనేకమంది సేవకులు ఆత్మీయంగా పడిపోవడానికి ప్రార్థనలేమే కారణం. సంఘాలు, సహవాసాలు చల్లబడటానికి, దెబ్బలాడుకొని కోర్టులెక్కడానికి ప్రార్థనాలేమే కారణం. సువార్త ఎక్కువగా వ్యాపించక పోవడానికి, మిషనెరీలకు శ్రమలు ఎక్కువకావడానికి, సాతాను చెలరేగి పనిచేయడానికి, విగ్రహారాధనకు, ఉజ్జీవం రాకపోవడానికి కూడా విశ్వాసులలోని ప్రార్థనా రాహిత్యమే కారణం.

మనం సరిగా ప్రార్థన చేయలేకపోవడానికి సోమరితనం, విశ్రాంతిలేని ఎడతెగని పని, నిరాశ, నిస్పృహ, శరీరాశలు, లోకాశలు, సంపాదన, ముసలమ్మ ముచ్చట్లు, అవిశ్వాసము, ప్రేమ తగ్గడం, ప్రభువుతో సహవాసం కోల్పోవడం మొదలగునవి.

## ప్రార్థన ఒక గొప్ప ఆయుధం

ప్రార్థన దేవుడు మన చేతిలో ఉంచిన ఒక ఆయుధం. ఆయన రక్తం ద్వారా మనలను విమోచించి మనకనుగ్రహించిన ఒక గొప్ప కృపా సాధనము. దీనిని విస్మరిస్తే కృపకు దూరమవుతాము. నాకు వేరుగా ఉండి మీరేమీ చేయలేరని (యోహాను 15:5) ప్రభువు చెప్పినా, ప్రార్థన లేమిలోనే, స్వంత శక్తితో, స్వంత ఆలోచనలతో మన పనులు చేసుకొంటూపోతే ఓడిపోతాము. గనుక ప్రతి పనిని ప్రార్థనలో దేవునికి అప్పగించాలి. ఏకాంత ప్రార్థన, కన్నీటి ప్రార్థన, విజ్ఞాపన ప్రార్థన, రాత్రంతా ప్రార్థన మొదలగు ప్రార్థనలు సాతాను రాజ్యాన్ని కూలుస్తాయి. దేవుని రాజ్యాన్ని హృదయాలలో స్థాపిస్తాయి.

## ముగింపు

మన సహవాసంలో ప్రార్థన ప్రాముఖ్యతను గుర్తెరిగి యల్ఆర్పి - 2030 లో ప్రార్థన పట్ల ఆసక్తి కలిగించడం అనే అంశాన్ని తొలి ఫోకస్ ఏరియాగా పొందుపరచడం శుభ పరిణామం.

యుఇయస్ఐ సభ్యులంగా వ్యక్తిగత ప్రార్థన సమయాన్ని పెంచుకుందాం, సామూహిక ప్రార్థన సమయాన్ని అర్థవంతంగా మార్చుకొందాం, ప్రార్థన సౌధాలు బలంగా నిర్మిద్దాం, పదునైన మన ప్రార్థనాయుధంతో సాతాను కోటలు కూల్చుదాం. ప్రభువు కృప మనకు తోడై ఉండును గాక!

- **వి. విల్సన్ బాలసుందరం,** నర్సరావుపేట

# ప్రార్థనలో పట్టుదల

**లూకా 18 :1-8**

## పరిచయం

ఆమె పుట్టి పెరిగింది పేదరికంలో. తండ్రి తాగుడుకు బానిస. సమాజంలో అణగారిన కుల నేపథ్యం. మారుమూల ప్రాంతం, చిన్న వయసులోనే పెళ్ళి. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. రోజువారి కూలీ పనులు చేసే భర్త. ఎన్నో ఇబ్బందులు, అడ్డంకులు, అవాంతరాలను అధిగమించి ఒక్కో మెట్టు ఎక్కుతూ బీఎస్సీ కాదు, యంఎస్సీ కాదు ఏకంగా పీహెచ్‌డీ చేసి ప్రపంచాన్ని నివ్వెర పరిచినది. ఆమె సాకే భారతి. కాదు, ఇప్పుడు డాక్టర్ సాకే భారతి. అనంతపురం జిల్లాలోని ఒక మారుమూల ప్రాంతానికి చెందిన ఆమెకు ఉన్న పట్టుదల ఎటువంటి పరిస్థితుల ను అయినా అధిగమించేటట్లు చేసింది.

పట్టుదల అనేది ఎంతో ప్రాముఖ్యమైన లక్షణం. అందుకే యేసుప్రభువు కూడా తన శిష్యులకు ఆ లక్షణాన్ని బోధించాడు. దేవునితో సహవాసం చేయడంలో, ముఖ్యంగా ప్రార్థించడంలో ఎన్నో అడ్డంకులు ఎదురవుతాయి. అందుకే ప్రార్థనా సమావేశాలకు, ఉపవాస ప్రార్థనలకు హాజరు అయ్యేవారు క్రమంగా తగ్గిపోవడం మనం చూస్తుంటాము. కారణం అడ్డంకులను అధిగమించలేని పరిస్థితి. అందుకే పట్టుదల ఉంటేనే గాని ప్రార్థనలో గడపలేమని తెలియజేయడానికి ఈ ఉపమానాన్ని తెలియజేసి శిష్యులు విశ్వాసంతో, పట్టుదలతో, ఓపికతో ప్రార్థించాలని ఆయన కోరుకొన్నాడు.

## నేపథ్యం

యేసుప్రభువు, శిష్యులు కలిసి యెరూషలేము వెళుతున్నప్పుడు ఆయన వారితో మాట్లాడుతూ క్షమాపణ, విశ్వాసం, తన రెండవ రాకడ గురించి తెలియజేస్తూ, పట్టుదల కలిగి విసుగక నిత్యము ప్రార్థన చేసే వారిగా ఉండాలని ఈ ఉపమానం చెప్పాడు.

## ప్రశ్నలు

1. పట్టుదల అంటే ఏంటి? పట్టుదల ఎప్పుడు అవసరం అవుతుంది?



2. ఈ వాక్యభాగంలో ఉన్న వ్యక్తులు, వారిని గురించిన వివరాలు తెలపండి?
3. విధవరాలు న్యాయం కోసం పోరాడేటప్పుడు తనకు ఎదురైన అనుభవాలు ఏంటి?
4. ఆ విధవరాలిలో, అన్యాయస్థుడైన న్యాయాధిపతిని మెప్పించిన లక్షణాలు ఏంటి?
5. న్యాయాన్ని పొందినప్పుడు ఆ విధవరాలు ఎలాంటి భావోద్వేగానికి లోనై ఉంటుంది? చుట్టుపక్కల వారు ఏమని మాట్లాడుకొని ఉంటారో చర్చించండి?
6. ఆ అన్యాయస్థుడైన న్యాయాధిపతికి, దేవునికి ఉన్న భేదాలు తెలపండి?
7. ఈ ఉపమానాన్ని తెలియజేయడం ద్వారా శిష్యులు యొక్క ప్రార్థనా జీవితంలో ఎటువంటి మార్పులను యేసుప్రభువు కోరుకుంటున్నాడో చర్చించండి?
8. ప్రస్తుతం విద్యార్థులుగా, గ్రాడ్యుయేట్స్‌గా, స్టాఫ్‌గా పట్టుదలతో ప్రార్థించాల్సిన అవసరం ఉన్నట్లు ఎలా గుర్తించగలం?
9. ప్రస్తుతం పట్టుదలతో ప్రార్థించాల్సిన అంశాలు ఏంటి?
10. ఎలాంటి పరిస్థితుల్లో ప్రార్థనలోపట్టుదలను కోల్పోయే అవకాశం ఉంది? పట్టుదలతో ప్రార్థించడానికి సలహాలు ఇవ్వండి?

## ముగింపు

చుట్టుపక్కల పరిస్థితులు, అంతర్గత పరిస్థితులు చూస్తుంటే మనందరం ఎంతో పట్టుదలతో ఎన్ని అడ్డంకులు ఎదురైనా దేవుని సన్నిధిలో మొరపెట్టడం జరిగితే అతి తక్కువ కాలంలో ఎక్కువ మంది విద్యార్థులను జీవ మార్గంలోనికి నడిపించే వారంగా దేవుడు మనల్ని ఆశీర్వదిస్తాడు.

– పి. కన్నయ్య, స్టాఫ్, విజయనగరం



# సంఘ చరిత్రలో కౌన్సిల్స్ వాటి తీర్మానాలు

క్రైస్తవ చరిత్ర ప్రారంభం నుండి, క్రైస్తవ సంఘాలచే నియమించబడిన నాయకులు ఎప్పటి కప్పుడు సాధారణ బోధన, తప్పుడు సిద్ధాంతాలు, వివాదాస్పద విషయాలపై అధికారికంగా నిర్ణయాలు తీసుకోవడానికి సమావేశమయ్యేవారు. ఇటువంటి సమావేశాలను సాధారణంగా కౌన్సిల్స్ లేదా సైనాడ్స్ అంటారు. గ్రీకులో సునోడోస్ అంటే “ఒక కల యిక”. సైనాడ్ అంటే సాధారణంగా ప్రాతినిధ్యాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి ఉద్దేశించిన సమావేశం అని అర్థం.

సంఘ చరిత్రలో సిద్ధాంతపరమైన, దైవజ్ఞానానికి సంబంధించిన వివాదాలు పరిష్కరించడానికి సంఘ కౌన్సిల్స్ వివిధ కాలాల్లో సమావేశమై తీర్మానాలు చేశాయి. ఆ తీర్మానాలు మన నమ్మకాలు, మన ఆచారాలను రూపించడంలో ప్రముఖ పాత్రను వహించాయి. ఆ కౌన్సిల్స్‌లో ప్రాముఖ్యమైన వాటిని తెలుకొందాం.

## యెరూషలేము కౌన్సిల్

బైబిల్లో యెరూషలేము కౌన్సిల్‌ను మొట్టమొదటిదిగా పరిగణించవచ్చు. అన్యజనులలో నుండి రక్షణ పొందిన వారు సున్నతి పొందితేనే గాని రక్షణ పొందలేరనే తప్పుడు బోధను ఖండించి, రక్షణ పొందడానికి సున్నతి అవసరం లేదనే తీర్మానాన్ని చేసింది. అయితే అదే సమయంలో అన్యజనుల నుండి రక్షణ పొందిన వారు జారత్వానికి దూరంగా ఉండాలని, గొంతు పిసికి చంపిన దానిని, రక్తాన్ని, విగ్రహార్పితాన్ని విసర్జించాలని తీర్మానించారు.

## 1. నైసియా కౌన్సిల్ - క్రీ.శ. 325

రోమన్ చక్రవర్తి కాన్‌స్టంటైన్ క్రైస్తవ్యాన్ని స్వీకరించాడు. ఏరియన్ వివాదాన్ని పరిష్కరించడానికి క్రీ.శ. 325లో నైసియా కౌన్సిల్ కాన్‌స్టంటైన్ చేత ఏర్పడింది. 4వ శతాబ్దానికి చెందిన ఏరియస్ అనే అలెగ్జాండ్రియాకు చెందిన బిషప్ ఈ క్రింది విధంగా ప్రతిపాదించాడు.

క్రీస్తు నిజంగా దైవ స్వభావం కలిగిన వ్యక్తి కాదు, ఆయన సృష్టించబడినవాడు. ఆయనకు ప్రారంభం ఉంది. తండ్రి ఒక్కడే స్వయంభవుడు, మార్పు లేనివాడు. కుమారుడు దేవుడు కాదు. కుమారుడు మొట్టమొదట సృజించబడినవాడు. కుమారుని ద్వారా తండ్రి దూతలను, సమస్తాన్ని సృజించాడు. తండ్రి సర్వోన్నతుడు. కుమారుడు తండ్రికి సహాయకుడు, లోబడి ఉంటాడు. తక్కువ వాడు.




ఈ భావనను అలెగ్జాండ్రియాకే చెందిన అథినేషియస్ అనే బిషప్ తీవ్రంగా వ్యతిరేకించాడు. ఈ వివాదం పరిష్కరించడానికి ప్రస్తుతం టర్కీలో ఉన్న నైసియా అనే ప్రాంతంలో సమావేశమై యేసుక్రీస్తు దైవత్వాన్ని పునరుద్ఘాటించాడు. తండ్రి కుమార పరిశుద్ధాత్ములు దైవత్వంలో సమానులని తీర్మానించారు. కుమారుడే నరావతారిగా ఈ లోకానికి వచ్చాడని తీర్మానించారు.

## 2. కాన్‌స్టాంట్‌నోపిల్ కౌన్సిల్ - క్రీ.శ.381

చక్రవర్తి థియోడిసియస్-1 పిలుపుమేర టర్కీలోని ఇస్తాంబుల్ (పూర్వం కాన్‌స్టాంట్ నోపిల్) లో ఈ సమావేశం జరిగింది. దీనికి 150 మంది బిషప్‌లు హాజరయ్యారు. ఈ కౌన్సిల్ నైసియన్ విశ్వాస ప్రమాణాన్ని ధ్రువపరుస్తూ, బాప్తిస్మమునకు చెందిన విశ్వాస ప్రమాణం ఆధారంగా తండ్రి కుమారులతో పాటు పరిశుద్ధాత్ముని సమానత్వంను అంగీకరించి ప్రకటించారు. అంటే త్రిత్వ సిద్ధాంతాన్ని పూర్తిగా ధృవపరిచి అంగీకరించారు. దీనిలో కేనన్ నిర్ధారించడమైనది.

నైసియన్ విశ్వాస ప్రమాణములో నిర్ధారించిన విషయాలు - 1. యేసు దేవుడు, 2. యేసు సిలువ మీద మరణించి మూడో దినాన తిరిగి లేచాడు, 3. పరిశుద్ధాత్ముడు కూడా దేవుడు, ప్రభువు, 4. ఒకే సార్వత్రిక సంఘం, 5. మృతులు తిరిగి లేస్తారు

## 3. ఎఫెసు కౌన్సిల్ - క్రీ.శ. 431

కాన్‌స్టాంట్‌నోపిల్‌కి చెందిన నెస్టోరియన్ మరియ దేవుని తల్లి (thetokos) అనే భావనను తిరస్కరించాడు. మరియ కేవలం ఒక మానవ మాత్రురాలు కాబట్టి ఒక మానవునికి మాత్రమే జన్మనివ్వగలదు. కన్య మరియ క్రీస్తు తల్లి, దేవుని తల్లికాదు అని పునరుద్ఘాటించి ఆయన నమ్మకాన్ని కొనసాగించాడు.

ఈ బోధ మానవాళి రక్షణను ప్రమాదంలో పడేసింది. యేసుక్రీస్తు జన్మత: దేవుడు కాకపోతే ఆయన మానవుడు మాత్రమే అవుతాడు. దైవమానవుడు కాలేడు.

ఇది నెస్టోరియన్ వివాదాన్ని పరిష్కరించడానికి ఏర్పడింది. నెస్టోరియన్ యేసుక్రీస్తు సాంప్రదాయ నరావతార సిద్ధాంతాన్ని తిరస్కరించాడు. దైవత్వంలో ఏకమై ఉన్న దైవ మానవ స్వభావాలను తిరస్కరించాడు. ఈయన ప్రకారం యేసు రెండు వ్యక్తుల కలయిక. మానవ వ్యక్తి మరియు దైవ వ్యక్తి. ఇది రెండు సారాల కలయిక కాదు లేక రెండు స్వభావాల ఏకత్వం కాదు. మానవత్వం యేసుకు సంబంధించినది కాదు.

ఈ కౌన్సిల్ యేసుక్రీస్తు హైపోస్టాటిక్ (వ్యక్తిత్వం) ఏకత్వాన్ని సమర్థిస్తూ ధృవీకరించారు. ఈ తీర్మానం ప్రకారం యేసు క్రీస్తులో దైవత్వం, మానవత్వం ఏకమై ఉన్నాయి. యేసు నూటికి నూరుపాళ్ళు దేవుడు మరియు నూటికి నూరుపాళ్ళు మానవుడు.

క్రీ.శ. 449లో జరిగిన రెండవ ఎఫెసు కౌన్సిల్ నెస్టోరియన్ బోధను ఖండించి కన్య మరియను దేవుని తల్లిగా ప్రకటించారు.

## 4. కాల్సిడన్ కౌన్సిల్ - క్రీ.శ. 451

క్రీస్తు స్వభావమును గూర్చి ధృవీకరించడానికి, ప్రకటించడానికి ఏర్పడిన కౌన్సిల్ ఇది. కాల్సిడన్ యొక్క ప్రస్తుత పేరు కడికోవై. ఇది ఆసియా మైనర్‌లోని టర్కీ వద్దనున్న ఇస్తాంబుల్ దగ్గర ఉంది.

రోమన్ చక్రవర్తి మార్సియన్ క్రీస్తు స్వభావాన్ని గూర్చిన వాదాన్ని పరిష్కరించడానికి ఏర్పాటు చేశాడు. యేసు మానవుడా లేక దేవుడా? పునరుత్థానం, ఆరోహణం ద్వారా దేవుడయ్యాడా? లేక దేవుడిగా ఉండి శరీరమును ధరించుకోవడంవల్ల నరావతారిగా వచ్చి మానవుడయ్యాడా? అనేది వివాదం. ఎలా ఆయన దైవత్వం, మానవత్వం, ఆయన స్వభావాన్ని, వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తాయి.

ఈ కౌన్సిల్ యేసు ఒకే స్వభావాన్ని కలిగి ఉన్నాడనే నమ్మకాన్ని తిరస్కరించింది. క్రీస్తుకు ఒకే వ్యక్తిత్వంలో రెండు స్వభావాలు కలిగి ఉన్నాయని ప్రకటించింది. ఈ రెండు స్వభావాలు పరిపూర్ణమని నొక్కిచెప్పింది.

యేసుక్రీస్తులో రెండు స్వభావాలు కల



వరపడకుండా, మార్పులేకుండా, అవిభాజ్యంగా వేర్పాటు లేకుండా ఉన్నాయనే నాలుగు నమ్మకాలు అంగీకరించి ధృవీకరించింది.

### 5. కాన్‌స్టాంట్‌నోపిల్ రెండవ కౌన్సిల్-క్రీ.శ.553

ఈ కౌన్సిల్ జస్టినియాన్ అనే చక్రవర్తి ఏర్పాటు చేశాడు. మే 5వ తేదీ క్రీ.శ. 553 నుంచి జూన్ 2 వరకు జరిగింది. హగీయ సోఫియా కేథడ్రిల్‌కు ఆనుకొని ఉన్న పెద్ద హాల్లో ఇది జరిగింది. తన రాజ్యంలో (బైజాంటైన్ రాజ్యం), సంఘంలో కాన్సిడోనియన్ వర్గానికి, మోనోఫిసైట్ (క్రీస్తుకు ఒకే స్వభావం ఉంది) వర్గానికి మధ్య సమాధానాన్ని తీసుకొని రావడానికి చేసిన ప్రయత్నాలలో ఇది ఒకటి.

మోనోఫిసిటజమ్-యేసుక్రీస్తుకు ఒకే స్వభావం ఉంది. అది దైవస్వభావం లేక మానవ స్వభావం. ఇది గతంలో జరిగిన కౌన్సిల్స్ చేత ఎల్లప్పుడూ తిరస్కరించబడుతూ వచ్చింది. ఈ భావనకు చాలా తక్కువ మద్ధతు ఉంది. ఏక స్వభావ వాదులు తప్పుడు బోధకులుగా పరిగణించబడ్డారు.

ఈ కౌన్సిల్ నెస్టోరియనిజమ్‌ను తిరస్కరించింది (యేసు రెండు వ్యక్తుల కలయిక, రెండు సారాల కలయిక కాదు, రెండు స్వభావాల ఏకత్వం కాదు). ఆరిగెన్ కూడా తప్పుడు సిద్ధాంతమైన కుమారుడు తండ్రి కంటే తక్కువ వాడు, తండ్రితో సమానమైన సారము గలవాడు కాదు, పునరుత్థానములో యేసు ఆత్మయే లేచింది అని చెప్పాడు.

### 6. కాన్‌స్టాంట్‌నోపిల్ మూడవ కౌన్సిల్-క్రీ.శ. 680-681

కాన్‌స్టాంటైన్ 4 చక్రవర్తి ఈ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశాడు. క్రీ.శ. 680, నవంబర్ 7న ప్రారంభమై సెప్టెంబర్ 16, క్రీ.శ. 681లో ముగిసింది. కాన్‌స్టాంటైన్ 4 జరిగిన 11 సెషన్స్‌కు అధ్యక్షత వహించాడు. 174 మంది బిషప్‌లు హాజరయ్యారు.

ఈ కౌన్సిల్ యేసు ఏక స్వభావాన్ని కలిగి ఉన్నాడనే భావనను ఖండించింది. 1. మోనో ఎనర్జిజమ్. క్రీస్తు రెండు స్వభావాలు కలిగి ఉన్నప్పటికీ ఒకే శక్తిని కలిగి ఉన్నాడు. 2. క్రీస్తుకు ఒకే ఒక చిత్తం ఉంది. దీనిని మోనోలితిజమ్ అంటారు. క్రీస్తు దైవ, మానవ సంకల్పంలో వ్యతిరేకత లేదు.

### 7. రెండవ నైసియా కౌన్సిల్ - క్రీ.శ. 787

ఇది టర్కీలో ఉన్న నైసియా (ఇప్పుడు ఐజింక్)లో జరిగింది. ఇది మత పరమైన చిత్రాలను, యేసుక్రీస్తు చిత్రాలను ఆరాధించడం అనే ఐకోనోలాస్టిక్ వివాదాన్ని పరిష్కరించడానికి ఏర్పడింది. బైజాంటైన్ చక్రవర్తి లియో-3 మతపరమైన చిత్రాలను, పరిశుద్ధుల చిత్రాలను ఆరాధించడం నిషేధించాడు.

సాంప్రదాయవాదుల అభిప్రాయం అయిన ఈ నిషేధం క్రీ.శ. 842 వరకు ఉంది. క్రీ.శ. 843లో థియోడోరా అనే చక్రవర్తిణి ఆరాధనలో భాగంగా చిత్రాలను ఉపయోగించడం ప్రారంభించింది. చిత్రాలను అభిమానించడం, ఆరాధించడం అనే విషయం అధికారికంగా ఆమోదం పొందింది.

ఈ కౌన్సిల్ తీర్మానాలను పరిశీలిస్తే అవి త్రిత్వం, యేసుక్రీస్తు, పరిశుద్ధాత్మల చుట్టూ తిరిగాయి. ఈ కౌన్సిల్స్ వల్ల వాదాలు పరిష్కరించబడి, తప్పుడు బోధలు, సిద్ధాంతాలు తిరస్కరించబడ్డాయి. మనము ఇవాంజెలికల్స్ అంటే వాక్యాన్ని నమ్మేవారం. వాక్యానికి, మన విశ్వాస ప్రవర్తన మీద సంపూర్ణ అధికారం ఉంది అని నమ్మేది మన సిద్ధాంతం. సిద్ధాంతాలను సరిగ్గా అర్థం చేసుకోవడానికి మన సహవాసాలలో వాక్యాన్ని , సిద్ధాంతాలను అధ్యయనం చేయాలి. మనం అథినేషియస్ విశ్వాస ప్రమాణాన్ని నమ్ముతాం. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలు సమానం మరియు ఏకమై ఉన్నారు. వారి దైవత్వంలో తేడా లేదు.

సిద్ధాంతాలు మన విశ్వాస జీవితానికి పునాది కాబట్టి, వాటి విషయంలో మనం అనుమానం లేకుండా సంపూర్ణమైన నిశ్చయత కలిగి ఉందాం.

**- జి. జెర్మియా ప్రసాద్,** ఏపి-ఇజియఫ్ స్టాఫ్, తుని

# హవ్వ

## జీవము గల ప్రతివానికి తల్లి



దేవుడు సృష్టించిన అందమైన ప్రపంచంలో ఆది స్త్రీ అయిన హవ్వ ఒక మనోహరమైన మణిహారం, అందమైన బహుమానం, విశిష్టమైన వ్యక్తిత్వం గలది.

హవ్వ అనే మాటకు అర్థం 'జీవము గల ప్రతివానికి తల్లి'. సృష్టిలో మొట్టమొదటి స్త్రీగా, భార్యగా, తల్లిగా మానవ చరిత్రలో నిలిచిపోయింది. అంతేకాదు సాతాను శోధనకు లొంగి, దేవునికి అవిధేయత చూపిన మొదటి వ్యక్తిగా, దేవుని వాగ్దానాన్ని పొందిన మొట్టమొదటి వ్యక్తిగా ఈమె మానవ చరిత్ర గమనాన్ని తలకిందులు చేసింది.

ఇలాంటి విశిష్టత కలిగిన హవ్వ పొందిన ఆధిక్యతలు, శోధనలు, తద్వారా ఆమె ఎదుర్కొన్న దుష్పరిమాణాలు, సవాళ్ళు, ఆవేదనలు గూర్చి క్లుప్తంగా తెలుసుకొందాం.

### ఆది స్త్రీ హవ్వ

దేవుడు తన స్వరూపంలో, తన పోలికలో ఆదాము, హవ్వను సృష్టించాడు. దేవుని పోలికంటే దేవుని గుణ లక్షణాలు అయిన తార్కిక ఆలోచన, సృజనాత్మకత, జ్ఞానము, ఆధ్యాత్మికత, నైతికత, స్వతంత్రత, వ్యక్తిత్వం, వినడం, మాట్లాడడం మొదలగునవి. ఈ దైవిక లక్షణాలన్నీ దేవుడు వీరిద్దరి కీ ఇచ్చాడు. స్త్రీ, పురుషులు ఇద్దరూ దేవుని దృష్టిలో సమానమే, విశిష్టమే. అసలు దేవుడు హవ్వను ఎందుకు సృష్టించాడు? ఆమె అవసరం, ప్రాముఖ్యత ఏంటో తెలుసుకొందాం.

### ఆదాముకు సాటి అయిన సహాయం

దేవుడు తాను చేసిన సృష్టి అంతటినీ పరి శీలించినప్పుడు అది మంచిగా కనిపించింది. కానీ, ఒక నరుని విషయంలో దేవునికి ఒక లోటు కనిపించింది, అది నరుని ఒంటరితనం. ఆదాము ఒంటరిగా ఉండడం దేవునికి ఇష్టం లేదు. తనకు తోడుగా ఉండడానికి స్త్రీని నిర్మించాలని భావించాడు.

దేవుడు తన సృష్టిలో చివరగా చేసింది స్త్రీనే. అద్భుతంగా, విభిన్నంగా దేవుడు స్త్రీని సృష్టించాడు. ఆదాముకు గాఢనిద్రను కలుగజేసి అతని పక్కటె ముకలలో ఒకదాన్ని తీసి ఆ చోటును మాంసంతో కూర్చి అతని పక్కటెముకలతో స్త్రీని నిర్మించి ఆదాము వద్దకు తీసుకువచ్చాడు. హవ్వను చూడగానే ఆదాము ఒక అద్భుతమైన పాటను పాడాడంటే అతను ఆనందంతో ఎంతగా పరవశించిపోయి ఉంటాడు. అతని లోటు, ఒంటరితనం తీరిపోయింది.

ఒక హెబ్రీ జాతీయం ఇలా చెబుతుంది. దేవుడు స్త్రీని ఆదాము పాదాల నుండి తీయలేదు, అలా తీస్తే ఆమె తన క్రింద అణిగిమణిగి ఉండాల్సి వచ్చేదేమో. దేవుడు స్త్రీని ఆదాము తల నుండి తీయలేదు, అలా తీస్తే ఆమె అతని మీద అధికారం చెలాయించేదేమో కానీ దేవుడు ఆదాము పక్కటెముకతో ఆమెను నిర్మించాడు. ఆదాము ఆమెకు భద్రత కల్పించాలని, ఆమెను ప్రేమించాలని ఆమెను అలా నిర్మించాడు.

హవ్వ ఆదాము ఒంటరితనాన్ని తీర్చే వ్యక్తి మాత్రమే కాదు గానీ అతనికి సాటి అయిన సహాయం కూడా, అంటే దేవుడు ఆదాముకు అప్పగించిన పనులలో సహాయకురాలిగా ఉండడానికి, అతనితో సంబంధం కలిగి ఉండడానికి, సంతాన ఉత్పత్తి కలిగించడానికి దేవుడు స్త్రీని సృష్టించాడు. వారి వివాహాన్ని దేవుడే జరిపించి భార్యాభర్తలుగా, మొదటి కుటుంబంగా వారిని చేశాడు.

### హవ్వ రాకతో ఆదాము ప్రాధాన్యతలలో కలిగిన మార్పు

"కాబట్టి పురుషుడు తన తండ్రిని తన తల్లిని

విడిచి తన భార్యను హత్తుకొనును. వారు ఏక శరీరమై ఉందురు" (ఆది 2:24). ఈ వచనం ద్వారా హవ్వ రాకతో ఆదాము ప్రాధాన్యతల్లో మార్పులు కలిగాయని మనకు అర్థమవుతుంది. ఈ వచనములో మూడు ముఖ్య పదాలు ఉన్నాయి.

**విడిచిపెట్టడం:** వివాహమైన తర్వాత పురుషుని ప్రాధాన్యతల్లో రావాల్సిన మార్పును ఈ పదం తెలియజేస్తుంది. అంటే కుటుంబ వైవాహిక జీవితంలో పురుషుడు మొదటి ప్రాధాన్యత దేవునికి, తర్వాత ప్రాధాన్యతను తన భార్యకు ఇవ్వాల్సి ఉంటుంది.

**హత్తుకొనుట:** హత్తుకొనుట అనే పదం ప్రేమతో కూడినటువంటి, ఎన్నటికీ తెగిపోని బంధాన్ని సూచిస్తుంది. అంటే ఆదాముతో హవ్వకు కలిగిన వివాహ బంధం శాశ్వతమైనది. మరణం తప్ప మరేది దీనిని విడదీయలేదు.

**ఏక శరీరమై ఉండడం:** ఈ పదానికి చాలా అర్థాలు ఉన్నాయి. దాంపత్య జీవితం, పిల్లలను కనడం, ఆధ్యాత్మిక, భావోద్వేగ సాన్నిహిత్యం కలిగి ఉండడం.

ఈ మూడు విషయాలు చాలా అద్భుతమైన దైవిక నియమాలు, దైవిక ఏర్పాటు. ఇవన్నీ హవ్వ రాకతోనే సాధ్యమైయ్యాయి. ఈ రోజుల్లో ఈ దైవిక నియమాలను పెడచెవిన పెట్టి కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. ఏదేనులా, చిన్న పరలోకంలా ఉండాల్సిన క్రైస్తవ కుటుంబాలు గొడవలు, అశాంతి, మనస్పర్థలు, ఎడబాట్లు మొదలగు వాటితో సతమతమవుతున్నాయి. దేవుడు తమ పట్ల ఉద్దేశించిన ప్రణాళికలను కోల్పోతున్నారు.

## హవ్వ ఆధిక్యతలు

సృష్టిలో మొదటి మహిళగా చాలా ఆధిక్యతలు, ప్రత్యేకతలు, ఆశీర్వాదాలు హవ్వకు లభించాయి.

- ❖ నేలమంటి నుండి కాకుండా ఆదాము పక్కటెముక ద్వారా నిర్మించబడింది.
- ❖ దేవుని పోలిక, స్వరూపంలో సృష్టించబడింది.
- ❖ దేవుడే దగ్గరుండి ఆమె వివాహాన్ని జరిపించాడు.
- ❖ దేవునితో ప్రత్యక్షంగా సహవాసాన్ని అనుభవించిన మొదటి, చివరి మహిళ.
- ❖ అందమైన ఏదేనులో పరిపాలకురాలు, పరిచారకురాలు.
- ❖ దేవుని నుండి ఆశీర్వాదం పొందిన మహిళ.
- ❖ భర్త చేత పేరు పెట్టబడిన స్త్రీ. మొదటిది 'నారీ' అంటే స్త్రీ. రెండవది పతనం తర్వాత హవ్వ 'జీవముగల ప్రతి వానికి తల్లి'.

## హవ్వ అవిధేయత

పచ్చని ఏదేనులో పండంటి కాపురంలా ఉన్న హవ్వ ఆదాముల కుటుంబంపై సాతాను కన్ను పడింది. ఈ కుటుంబం పట్ల, వీరి ద్వారా రాబోయే మానవులందరి పట్ల దేవుని గొప్ప ప్రణాళికలు అన్నిటిని సాతాను నాశనం చేయాలనుకున్నాడు. ఈ క్రమంలో సాతాను మొదటిగా హవ్వను శోధించాలనుకున్నాడు. సాతాను సర్పమును ఉపయోగించి హవ్వ వద్దకు వచ్చి, ఆమెను మోసగించడానికి, పాపం చేసేటట్లు ప్రోత్సహించడానికి హవ్వతో సాతాను సంభాషణ కొనసాగించాడు (ఆది 3:1-6). ఈ సంభాషణ ఫలితంగా...

- ❖ హవ్వ సాతాను అబద్ధపు మాటలు నమ్మి దేవునిని సందేహించింది.
- ❖ దేవుడిచ్చిన వాటన్నిటిని మరిచిపోయి ఇవ్వని దాన్ని ఆశించింది.
- ❖ దేవునికి అవిధేయత చూపి సాతానుకి లోబడింది.
- ❖ తనతో పాటు తన భర్తను కూడా అవిధేయుడిగా చేసింది.
- ❖ దేవుడు కఠినమైన వాడని, స్వార్థపరుడని, మంచి చెడుల తెలివిని ఇచ్చే ఫలమును తిని వారు దేవదూతలుగా మారడం ఆయనకి ఇష్టం లేదని సాతాను హవ్వను నమ్మించాడు.
- ❖ దేవుని మంచితనాన్ని, దేవుని ప్రేమను మరిచిపోయింది.
- ❖ శోధన సమయంలో ఆమె దేవునిని గాని,



తన భర్తను గాని సంప్రదించక తన ఇష్టాన్ని అనుసరించి తన కోరికను నెరవేర్చుకొన్నది.

### విశ్వాసులపై సాతాను ప్రయోగించే పన్నాగాలు

- ❖ దేవుని మంచితనాన్ని, దేవుని వాక్యాన్ని అనుమానించేటట్లు చేయడం.
- ❖ నిరుత్సాహపరచడం అంటే దేవుని వైపు కాకుండా సమస్యలు వైపే చూసేటట్లు చేస్తాడు.
- ❖ దేవుని వాక్యపు సత్యాలకంటే లోక విషయాల పట్ల ఆకర్షితులయ్యేటట్లు చేయడం.
- ❖ నీకు చేతకాదు, నీవు అనర్హుడవు అని చెబుతూ ఒక పనిని చేయడానికి ప్రయత్నించకుండా అడ్డగిస్తాడు.
- ❖ ఒక పనిని ఒక విశ్వాసి ఎన్నడూ చేయకూడదనే ఉద్దేశంతో దానిని అతడు వాయిదా వేసేటట్లు చేస్తాడు.

### శోధనను జయించడానికి విశ్వాసులు గుర్తుంచుకోవాల్సిన మూడు విషయాలు

- ❖ ప్రార్థన చేయాలి.
- ❖ శోధనలో పడిపోయే పరిస్థితుల నుండి పారిపోవాలి.
- ❖ తప్పు చేయాల్సి వచ్చినప్పుడు నేను చేయను, చేయకూడదు అని దృఢంగా తీర్మానించుకొని దేవుని సహాయం కోరుకోవాలి.

### హవ్వ ఆవేదనలు

- ❖ పాపం మూలంగా ఇద్దరూ దేవునిని నేరుగా ఎదుర్కొనలేక చెట్ల చాటున దాక్కున్నారు. దేవుని శాపానికి గురై ఏదేనులో నుండి బహిష్కరణకు గురయ్యారు. ఆధ్యాత్మిక, శారీరక మరణాలను కొనితెచ్చుకొన్నారు.
- ❖ దేవునికి అవిధేయత చూపి ఆయనపై తిరుగుబాటు చేయడం ద్వారా దేవునితో సహవాసం కోల్పోయి, పరలోకం లాంటి ఏదేను తోటలో నివాసం వంటి గొప్ప ఆశీర్వాదాలను తలచుకొని తన జీవితాంతం హవ్వ కుమిలిపోయి ఉంటుంది.
- ❖ శపించబడిన నేలను సేద్యపరిచి తనను, తన కుటుంబాన్ని పోషించుకోవడానికి తన భర్తతో కలిసి ఎంతో శ్రమించాల్సి వచ్చింది.



- ❖ మిక్కిలి ప్రసవవేదనతో పిల్లల్ని కనాల్సి వచ్చింది.
- ❖ తన భర్తపై ఆధిపత్యం చెలాయించాలన్న కోరిక కలుగుతుందని దేవుడు శపించాడు (ఆది 3:16). ఈ కోరిక మూలంగా తన భర్తతో విభేదాలు గొడవలు కలిగి ఉండవచ్చు.
- ❖ మొదట తనకు కలిగిన ఇద్దరు కుమారులలో మొదటివాడు హంతకుడయ్యాడు. రెండో వాడు హతుడయ్యాడు. ఇది ఆమెకు తీవ్రమైన గర్భశోకాన్ని మిగిల్చింది.
- ❖ దీనంతటికీ నువ్వే కారణం నువ్వే అని బ్రతికినంత కాలం ఆమెను ఆదాము నిందించి ఉంటాడు. ఈ నిందను ఆమె జీవితాంతం భరించింది.
- ❖ ఈ ఆవేదనలన్నిటిలో ఆమె ఒకే ఒక నిరీక్షణతో జీవించింది. అదే దేవుని వాగ్దానం (ఆదికాండం 3:15).


### హవ్వ ఆధ్యాత్మిక వారసత్వం

పతనం తర్వాత ఎన్నో సవాళ్ళు, సంక్షోభాలు ఎదుర్కొని తన జీవితాన్ని కుటుంబాన్ని ముందుకు నడిపించిన ధీశాలి హవ్వ. దేవుడిచ్చిన వాగ్దానాన్ని మదిలో నిలుపుకొని నిరీక్షణతో ఎదురు చూసింది. తన మొదటి కుమారుడు కయీను జన్మించినప్పుడు దేవుని దయను ఆమె కీర్తించింది. హేబెలు, షేతులు ఆధ్యాత్మిక జీవితంలో గొప్పవారిగా ఎదగడంలో ఆమె పాత్ర చాలా ఉండి ఉంటుంది. దేవుడు సెకండ్ బెస్ట్ ఇవ్వగల సమర్థుడు అని తన జీవితం ద్వారా నిరూపించింది.

### ముగింపు

సమాజంలో ఒక క్రైస్తవ స్త్రీగా, భార్యగా, తల్లిగా దేవునికి మన పట్ల ఉన్న ప్రణాళికలు నెరవేరేటట్లు ఆయన మాటకు విధేయత చూపుదాం. సాతాను పన్నాగాలను, శోధనలను విశ్వాసంతో ఎదిరిద్దాం. విశ్వాస జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను, ఆవేదనలను నిరీక్షణతో ఎదుర్కొందాం.

**– జి. మల్లేశ్వరి రామస్వామి,** దర్శి



# కుటుంబ ప్రార్థన

తండ్రి బాగా డబ్బున్నవాడు, వ్యాపారి. ఎంత డబ్బు కావాలో అంత డబ్బు ఆ యువకునికి దొరుకుతుంది. దాంతో ఇష్టానుసారంగా జీవించడం ప్రారంభించి, తండ్రికి, ఇంటికి దూరమై.... బ్రతుకును నాశనం చేసుకొని, దారి తప్పి జీవిస్తున్నాడు. ఒక ఇంటిలో కొంతమంది కూర్చొని క్రీస్తును స్తుతిస్తూ, ప్రార్థిస్తూ ఉండగా ఆ ప్రార్థనకి దారి తప్పి పతనమైపోయిన ఈ యువకుణ్ణి ఎవరో తీసుకొని వెళ్ళారు. ఆ ఇంటిలో అందరూ కలిసి ప్రార్థన చేస్తున్నప్పుడు ఆ యువకుడు నెమ్మదిగా ఆ ఇంటిలోకి వచ్చి, వాళ్ళు కూర్చున్న విధంగా నెమ్మదిగా మోకాళ్ళ మీద కూర్చున్నాడు. వాళ్ళు కలిసి ప్రార్థన చేస్తున్నప్పుడు, కలిసి పాటలు పాడుతున్నప్పుడు.. ఆ యువకుని మదిలో ఓ ప్రశ్న? నా జీవితంలో ఎప్పుడూ పొందని ఆనందం, నెమ్మది, సంతోషం.. ఈ గృహంలో ఎలా సాధ్యం అవుతుంది? అని ఆలోచిస్తూ, ఈ ఇంట్లో దేవుని సన్నిధి ఉన్నదని గ్రహించాడు. తర్వాత తన పాపాల్ని ఒప్పుకొని దేవునిని అంగీకరించి, తన జీవితాన్ని క్రీస్తుకు అంకితం చేసుకొన్నాడు. ప్రభువా..! నన్నేమి చేయమంటావో చెప్పు, జీవించినంత కాలం నీ కొరకే జీవిస్తాను అని ప్రార్థించాడు. ఆ యువకుడు క్రీస్తు ప్రేమను పొందుకొన్న తరువాత, ఆ ప్రేమను చూపించడానికి అనేకమంది పేదవారిని, అనాథలను చేరదీశాడు. ఒక వైపు సువార్తను ప్రకటిస్తూనే, మరొక వైపు అనేక వేలమందికి ఆహారాన్ని పెట్టి ప్రపంచ చరిత్రలో ఒక విశ్వాస వీరునిగా... పది వేలమందికంటే ఎక్కువగా ఉన్న అనాథ పిల్లలకు ఆత్మీయ తండ్రిగా మారాడు. ఆ యువకుడే జార్జ్ ముల్లర్. జార్జ్ ముల్లర్ క్రీస్తు బిడ్డగా మారిన కారణం – ఒక ఇంటిలో యేసు ఉన్నాడు. ఆ ఇంటిలో ఆరాధన, ప్రార్థన ఉంది. ఆ ఇంటిలో ఉన్న దేవుని సన్నిధి, దేవుని శక్తి పాడైపోయిన జార్జిముల్లర్ జీవితాన్ని మార్చివేసింది.

### కుటుంబ ప్రార్థన అంటే?

క్రైస్తవ కుటుంబములోని సభ్యులందరూ ప్రతి దినం దేవుని సన్నిధికి వచ్చి పాటల ద్వారా ఆయనను ఆరాధించి, వాక్యమును చదివి, దానిని క్లుప్తంగా ధ్యానించి, అర్థవంతమైన ప్రార్థనలో గడపడమే కుటుంబ ప్రార్థన.

## కుటుంబ ప్రార్థన ప్రాముఖ్యత

కుటుంబ ప్రార్థన అనేది క్రైస్తవ జీవితంలో అతి ప్రాముఖ్యమైనది, అతి విలువైనది. కుటుంబంతో కలిసి ప్రార్థించకపోతే కలిసి జీవించలేరు.

ఇంటిలో దేవుని వాక్యం ఉంచుకొని ధ్యానించకుండా, ప్రార్థించకుండా ఉంటే ఏమి ప్రయోజనం. కలిసి ప్రార్థించడం ద్వారా ప్రభువు మన ఇంటిలో ఉంటాడు. యేసయ్య మన ఇంటిలో లేకపోతే అది నరకమే.

ప్రతి ఒక్కరికి జీవితంలో కుటుంబం మొదటి ఆధ్యాత్మిక శిక్షణా కేంద్రం. ముఖ్యంగా చిన్న బిడ్డలకు ఆధ్యాత్మిక శిక్షణ ఇవ్వగలిగే సమయం, స్థలం. ఈ దినాలలో పిల్లలను దైవిక భయంలో పెంచడం ఒక పెద్ద సవాలు. మీడియా, సెల్‌ఫోన్, చెడు స్నేహితుల ప్రభావంతో సతమతమవుతున్నారు. బాలుడు నడువవలసిన త్రోవను వానికి బాల్యమందే నేర్పుము, వాడు వృద్ధుడైనను దానినుండి తొలగిపోడని సామె. 22:6లో రాయబడింది. నీవు నీ యింట కూర్చుండునప్పుడు, త్రోవను నడుచునప్పుడు, లేచినప్పుడు వాటిని గూర్చి మాట్లాడుచు వాటిని మీ పిల్లలకు నేర్పవలెనని ద్వితీయోపదేశకాండం 11:19లో ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించబడింది. బిడ్డలకు దైవ భయం నేర్పించగలిగే ప్రశస్త సమయం కుటుంబ ప్రార్థన.

## కుటుంబాలపై సాతాను దాడి ఉంటుంది

దేవుని పరలోకపు ఉద్దేశాలు భూలోకంలో నెరవేరడానికి దేవుడు ఏర్పరచుకొన్న వ్యవస్థ కుటుంబం. ఆదినుండి దేవుడు కుటుంబాలను ఏర్పరచి వారితో సహవాసం చేయడానికి ఇష్టపడ్డాడు. కుటుంబం దేవుని చిత్తంలో కట్టబడి ఆయనకు విధేయత చూపిస్తే ఆ కుటుంబం ఆశీర్వదించబడి, అనేకులకు దీవెనకరంగా ఉంటుంది. అందుకే దేవుని వాక్యంలో వివాహానికి, దైవ కేంద్రిత కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వబడింది. యేసు ప్రభువు బండ మీద కట్టబడే ఇల్లు గురించి తెలియజేశారు. తుఫానులు, వరదలు, గాలులు వీచినా అట్టి ఇల్లు నిలిచి ఉంటుంది. కుటుంబాలకు క్రీస్తు అనే పునాది ఉంటే వారి మీదికి వచ్చే ప్రతి శోధనకు వారు నిలుస్తారు. ఇసుక మీద కట్టే ఇల్లు త్వరగా కూలిపోతుంది. ఈ రహస్యము సాతానుకు బాగా తెలుసు, కాబట్టి వాడు క్రైస్తవ కుటుంబాలను గురి చేసుకొని వాటిని కూల్చడానికి పని చేస్తున్నాడు. "సాతాను తన అగ్ని బాణాలను నామకార్థ క్రైస్తవులపై ఉపయోగించి అనవసరంగా వృధా చేసుకోడు" అని జార్జి వర్వర్ చెబుతాడు.

## కుటుంబ ఆశీర్వాదానికి మూలం

ఆశీర్వాదకరమైన క్రీస్తు కేంద్రిత కుటుంబాలను ఎలా నిర్మించుకోగలం? ఎలా దేవునిలో బలపరచుకోగలం? గొప్ప దైవజనుడు బిల్లీ గ్రాహం గారు వారి పరిచర్య ప్రభావవంతంగా ఉండడానికి మూడు రహస్యాలు చెప్పారు. అవి 1.ప్రార్థన, 2.ప్రార్థన, 3.ప్రార్థన. ప్రభువు తన శిష్యులకు ప్రార్థన ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రార్థన వలననే తప్ప మరి దేని వలనను ఇది సాధ్యం కాదని ఒక సందర్భంలో తెలియజేశారు. ఇయు పరిచర్యలో ప్రతి విద్యార్థి, గ్రాడ్యుయేట్ దేవునితో ప్రతిదినం ప్రశాంత సమయం గడపాలని ప్రోత్సహిస్తాం. అయితే కుటుంబంగా దేవుని సన్నిధిలో ప్రార్థనలో గడపడమనేది కుటుంబానికి ఎంతో ఆశీర్వాదకరం.

## కుటుంబ ప్రార్థన ఎవరు నడిపించాలి?

భార్య, భర్త, పిల్లలు ఇంటిలో ఉన్న వారందరూ కుటుంబ ప్రార్థనలో పాల్గొనాలి. భర్త ఒక ఆధ్యాత్మిక నాయకుడిగా కుటుంబ ప్రార్థనకు అందరిని ప్రోత్సహించాలి, నడిపించాలి. భర్త ఏ కారణం చేతనైనా అట్టి బాధ్యత తీసుకోకపోతే భార్య ప్రోత్సహించాలి.

## బైబిల్లో మాదిరి కలిగిన కుటుంబాలు

**మోషే:** మోషే చిన్నవాడుగా కొద్దికాలం రాజకుమార్తె అనుగ్రహం ద్వారా పెంచబడడానికి తన తల్లి చేతికి అప్పగించబడ్డాడు. తన భవిష్యత్‌లో తీసుకొనబోయే ప్రాముఖ్య నిర్ణయాలకు తగిన తర్ఫీదు, ప్రోత్సాహం కుటుంబంలోనే పొందాడు. మోషే పెద్దవాడైనప్పుడు విశ్వాసాన్ని బట్టి ఐగుప్తు ధనంకంటే క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని ఎంచుకొని, అల్పకాల పాప భోగం అనుభవించడంకంటే దేవుని ప్రజలతో శ్రమ అనుభవించడం మేలని యెంచి ఫరో కుమార్తె కుమారుడు అని అనిపించుకొనుటకు ఒప్పుకోలేదు (హెబ్రీ 11:26). మోషేకు అట్టి తర్ఫీదు కుటుంబంగా దేవునితో గడిపే సమయంలో లభ్యమైందని గ్రహించవచ్చు.

**యోబు:** యోబు ప్రతి దినము తన కుమారులు పాపము చేసి హృదయంలో దేవుని దూషించారేమోనని వారిని పిలిచి వారిని పవిత్రపరచి అరుణోదయమున లేచి వారిలో ఒక్కొక్కని నిమిత్తం దహనబలి అర్పించాడని యోబు 1:5లో చూస్తాం. మన ఇంటి చుట్టూ ప్రహరీగోడ వేసుకొంటాం. అది మన ఇంటికి ఒక కంచెలాగా భద్రత కొరకు నిర్మిస్తాం. అలాగే యోబు ప్రార్థన, ఇంటి వారికి కంచెవలె ఉందని గమనించగలం.

**కొర్నేలీ:** అన్యుడైన కొర్నేలీ సహితము భక్తిపరునిగా ఉండి తన ఇంటి వారందరితో కూడా దేవుని యందు భయభక్తులు కలిగి ఎల్లప్పుడు ప్రార్థన చేసే అను భవం కలిగినట్లు అపో. 10:2లో చదువుతాం. కొర్నేలీ పేతురును పిలిపించి ముఖ్య స్నేహితుల ను, బంధువులను ఆహ్వానించినప్పుడు వారు దేవుని వాక్యము విని అంగీకరించినట్లు గ్రహిస్తాం.

**అబ్రాహాము**: దేవుడు అబ్రాహామును పిలిచినప్పుడు తన కుటుంబంతో సహా దేవుడు చూపించే ప్రదేశానికి వెళ్ళాడు. అతడు వెళ్ళిన ప్రతి చోట దేవునికి బలి పీఠాలు కట్టాడు. దేవునితో తన కుటుంబాన్ని ఐక్యపరిచాడు. అతడు బేతేలుకు, హాయికిని మధ్య గుడారం వేసి యెహోవాకు బలిపీఠము కట్టి యెహోవా నామమున ప్రార్థన చేశాడు (ఆది. 12:8). తరువాత దేవుడు అబ్రాహామును ఆత్మ సంబంధమైన, భూసంబంధమైన ఆశీర్వాదాలతో నింపినట్లు మనం చూస్తాం. అబ్రాహాము దేవుని స్నేహితుడుగా పిలవ బడ్డాడు. అబ్రాహాము, శారాలు అనేక జనములకు తల్లిదండ్రులుగా పిలవబడ్డారు.

## కుటుంబ ప్రార్థన ఎప్పుడు, ఎంత సమయం, ఎలా?

కుటుంబ ప్రార్థనకు ఉదయము గాని, సాయం త్రము గాని అనుకూలము. చాలా కారణాల దృష్ట్యా ఉదయము కంటె సాయంత్రమే మంచిది. కాని పిల్లలు పడుకొనే సమయంలో కుటుంబ ప్రార్థన జరపడం సరికాదు. కుటుంబ సభ్యులందరి అనుకూలతను పరిగణలోనికి తీసుకొనవలెను. దీనికి ఖచ్చితమైన నియమమేదీ లేదు. కాని సమయం మరీ ఎక్కువగా గాని, లేక మరీ తక్కువ గాని ఉండరాదు. 30 నిమిషాల వరకు ఉత్తమం.

తల్లిదండ్రులు ఆహ్లాదకరమైన సులభతరమైన వాతావరణాన్ని సృష్టించాలి. హాజరైన ప్రతి ఒక్కరూ పాల్గొనేలా చూడాలి. ప్రార్థించి, పాటలు పాడి, క్రమముగా బైబిలునుండి ఒక వాక్యభాగాన్ని తీసి చదవాలి. ఈ సమయంలో కుటుంబములోని ప్రతి ఒక్కరు వారి చేతులలో స్వంత బైబిలు కలిగి ఉండాలి. చిన్న వాక్య భాగాన్ని పఠించాలి. ఆలోచింపచేసే ప్రశ్నలు అడగాలి. వ్యక్తిగత అభిప్రాయాలు సున్నితంగా తెలుసుకోవాలి. ప్రతి ఒక్కరు వాక్యభాగములోని మూల అంశాన్ని రాబట్టాలి. ప్రతి వచనాన్నీ చదువుతూ, సందర్భాన్ని కోల్పోకుండా వాక్యభాగం యొక్క సరైన అర్థాన్ని గ్రహించాలి. జ్ఞానయుక్తంగా చర్చిస్తూ, వాక్యభాగం నుండి వాగ్దానాలు, సూచనలు, ఆజ్ఞలు వెలికి తీసుకురావాలి. గ్రహింపగలిగే భాషలో మన స్వంత జీవిత పరిస్థితులకు అన్వయింప చేయాలి. రోజుకు ఒకరుచొప్పున ప్రార్థన చేస్తూ కుటుంబ ప్రార్థనను ముగించాలి. వీలైనంత వరకు దీర్ఘ ప్రార్థనలు ఈ సమయంలో చేయకూడదు. ఇతరుల గురించి ప్రార్థి ంచడం, విజ్ఞాపన చేయడం ద్వారా పిల్లలు కూడా దీనిని అలవరచుకొంటారు. సంఘము, దేశము వంటి ముఖ్య ప్రార్థనాంశాల గురించి ప్రార్థించాలి.

## కుటుంబ ప్రార్థన ప్రయోజనాలు

కుటుంబ ప్రార్థన - కుటుంబమంతా దేవునితో సహవాసంచేసే ప్రశస్థ సమయం. కలిసి దేవుని వాక్యము ధ్యానించడానికి, కుటుంబ అవసరతలు కొరకు ప్రార్థించడానికి అనువైన సమయము. కుటుంబానికి కావలసిన నడిపింపు పొందగలిగే సమయం. ఒకరినొకరు క్షమించుకొని సమాధానపడే సమయం. కుటుంబపరంగా గాని, ఉద్యోగపరంగా గాని, పరిచర్య పరంగా గాని, ఎన్నో ఒత్తిడిలకు గురి అవుతుంటాం. అలాంటి సందర్భాలలో చిరాకు, అసహనంతో ఒకరిపై ఒకరు కోపపడే పరిస్థితులు కలుగవచ్చు. అయితే కుటుంబ ప్రార్థనలో వాటిని సరిచేసుకొనే అవకాశం ఉంటుంది. కుటుంబంలో ఇంకా ప్రభువును నమ్ముకొనని వారు కుటుంబ ప్రార్థనలో దేవుని వాక్యం విని ప్రభువుని విశ్వసించే అవకాశాలు కలుగుతాయి. కుటుంబ ప్రార్థనల ద్వారా చుట్టూ ఉండే కుటుంబాలకు సంతోష సువార్త సునాదాలు వినిపించవచ్చు. కుటుంబంలో దేవుడు చేసే మేళ్ళను బట్టి దేవునిని మనసారా స్తుతించవచ్చు.

– **కె. యోహాన్,** తుని




# మార్కులా? మంచి నైపుణ్యాలా?

"చాలామంది ప్రొఫెషనల్స్ ప్రొఫెషనల్ కాలేజీల నుంచి వస్తున్నారు గానీ, వాస్తవంగా వారు ప్రొఫెషనల్స్ కాదు" అని ఓ ప్రొఫెసర్ అంటాడు. దానికి కారణం వారి దగ్గర సరైన నైపుణ్యాలు లేవు కాబట్టి వారిని ప్రొఫెషనల్స్ అని అనలేము అంటాడు. ఒక స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ వాళ్ళు "బి స్కిల్డ్ అండ్ బి ఎంప్లాయిడ్" అనే స్లోగన్‌ను ప్రాచుర్యంలోకి తెచ్చారు. అంటే 'నైపుణ్యాలను కలిగి ఉండు, ఉద్యోగాన్ని పొందు' అని అర్థం. ఇయు విద్యార్థులు, అన్ ఎంప్లాయిడ్ గ్రాడ్యుయేట్స్‌గా కెరీర్‌లో స్థిరపడడానికి, మంచి ఉద్యోగం పొందడానికి మార్కులు, నైపుణ్యాలు రెండూ కావాలా? ఏదైనా ఒకటుంటే సరిపోతుందా? అనే విషయాల్ని మనం ఆలోచన చేద్దాం.

### నేటి పోటీ ప్రపంచంలో మంచి మార్కులు అవసరం

ఇయు విద్యార్థులుగా ఆత్మీయ ఎదుగుదలతో పాటు కెరీర్ గురించిన ప్రణాళిక కూడా చాలా ప్రాముఖ్యమైనది. నీ కెరీర్‌లో నీవు స్థిరపడాలంటే, పయనించే మార్గంలో శక్తివంచన లేకుండా, ప్రణాళికాబద్ధంగా దేవుని సహాయంతో కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలి. ఈ మార్కులు నీ తెలివిని, కష్టాన్ని, సామర్థ్యాన్ని తెలియజేస్తాయి.

పాత రోజుల్లో పాస్ అయితే చాలు. కానీ ఇప్పుడు ఫస్ట్ క్లాస్ లేదా డిస్టింక్షన్ రావాలి. ఫస్ట్ క్లాస్ లేకపోతే కొన్ని ఉద్యోగాలకి అర్హత కూడా లేదు. ఈ 21వ శతాబ్దంలో మార్కులు కూడా చాలా ప్రాముఖ్యం. ఒత్తిడి లేని విద్యతో మంచి మార్కులు సాధించాలి. కొంతమంది ఇయు విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదవకుండా, బ్యాక్‌లాగ్స్ ఉంచుకుంటున్నారు. ఇది వారి కెరీర్‌కి మంచిది కాదు. దేవుని నామానికి అవమానం తీసుకొస్తూ, క్యాంపస్‌లో వారి సాక్ష్యాన్ని పోగొట్టుకొంటున్నారు.

### మంచి మార్కులు ఉండి నైపుణ్యాలు లేకపోతే ఉద్యోగం పొందడం, దానిలో రాణించడం చాలా కష్టం

ప్రస్తుత పరిస్థితుల్లో మార్కులు లేదా గ్రేడ్‌లతో పాటు మంచి నైపుణ్యాలు కూడా అవసరం. ఈ రెండిటిలో ఏది లోపించినా పోటీ ప్రపంచంలో ఉద్యోగం సంపాదించడం చాలా కష్టం. కొంతమంది యంగ్ గ్రాడ్యుయేట్స్ దేవుని సహాయంతో కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకొంటున్నారు. కానీ వాళ్ళకు నైపుణ్యాల లేమి వల్ల, కొంతమంది ఉద్యోగాల్లో ఇంటర్వ్యూ వరకు వెళ్ళి నిరాశతో వెనుతిరుగుతున్నారు. ఇక మా వల్ల కాదు, మాకు ఉద్యోగం రాదు, మేము పనికిరామనే నిరుత్సాహ ధోరణి వారిలో బలంగా ఏర్పడుతుంది. పీజీ, బీటెక్ చదివి, డిప్లమోలు పూర్తి చేసి, డాక్టరేట్స్ ఉండి కూడా ఉద్యోగం తెచ్చుకోలేక, కార్పొరేట్ ఫీల్డ్‌లో అడుగుపెట్టలేక ఓడిపోయిన వారిగా కనిపిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం మార్కులు, డిగ్రీలతో

పాటు నైపుణ్యాల్ని అభివృద్ధి చేసుకోకపోవడం. వ్యక్తిగత కారణాలు ఎన్నైనా ఉండొచ్చు కానీ వాటిని నేర్చుకోకపోతే గవర్నమెంట్ అయినా, ప్రైవేట్ అయినా, కార్పొరేట్ ఫీల్డ్ ఏదైనా ఉద్యోగం పొందడం చాలా కష్టం. కాబట్టి మంచి మార్కులతో పాటు నైపుణ్యాల్ని అభివృద్ధి చేసుకోవాలి. ఎందుకంటే ఉద్యోగాలు తక్కువగా ఉంటున్నాయి. ఒక చిన్న నోటిఫికేషన్ వేస్తే లక్షల మంది దరఖాస్తు చేసుకొంటున్నారు. ఈ పోటీ ప్రపంచంలో వారి కన్నా మెరుగైన వారిగా ఉండాలంటే నైపుణ్యాలను సొంతం చేసుకోవాలి. ఈ నైపుణ్యాల్ని సొంతం చేసుకోవాలంటే తగినంత కృషి చేయాలి. ప్రసంగి 9:10 ప్రకారం చేయుటకు నీ చేతికి వచ్చిన ఏ పని అయినను నీ శక్తి లోపం లేకుండా చేయుము. దేవుడు మనల్ని దీవించాలంటే మనం కూడా కష్టపడాలి.

## పోటీ ప్రపంచంలో ఉద్యోగం పొందడానికి, దానిలో రాణించడానికి ఎలాంటి నైపుణ్యాలు కావాలి

### ఎ. నైపుణ్యం అంటే ఏంటి?

సాధన ద్వారా నేర్చుకునే దానిని నైపుణ్యం అంటారు లేదా ఏదైనా నేర్పుగా చేయగలిగిన సామర్థ్యం. దీనిని బట్టి నైపుణ్యం అంటే సాధన ద్వారా నేర్చుకోవచ్చు అని అర్థం. నైపుణ్యాలు నీ సామర్థ్యాన్ని తెలియజేస్తాయి.

### బి. నైపుణ్యాలు ఎందుకు ప్రాముఖ్యమైనవి?

విద్యార్థులు వారి కెరీర్‌లో ఎంచుకొన్న ఉద్యోగాన్ని విజయవంతంగా సాధించడానికి ఈ నైపుణ్యాలు అవసరం. ఈ నైపుణ్యాలు అంతర్గతంగా ఉన్న సామర్థ్యాలను బహిర్గతం చేసి వారిని టాపర్స్‌గా ఉంచుతాయి. ప్రపంచంలో మీరు ఎక్కడ ఉన్నా ప్రత్యేకమైన వారిగా ఉండేలా చేస్తాయి. కాబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటికోసం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాయి. రోజురోజుకీ నైపుణ్యాల శిక్షణకి ప్రాధాన్యం పెరుగుతుంది. స్కూల్, కాలేజీ మరియు విశ్వవిద్యాలయాలలో నైపుణ్యాల్ని కరికులంలో భాగంగా చేరుస్తున్నారు. నైపుణ్య ఆధారిత అభ్యసనం విద్యార్థులను త్వరగా ఉద్యోగాలు పొందుకొనే దిశగా నడిపిస్తుంది.

### సి. వివిధ రకాల నైపుణ్యాలు

వివిధ సందర్భాలలో వాటిని ఉపయోగించే తీరుని బట్టి వివిధ రకాలుగా విభజించారు.

#### 1. హార్డ్ స్కిల్స్

హార్డ్ స్కిల్స్ అంటే ప్రత్యేకమైన వాటి కొరకు నిర్ణయించబడిన సామర్థ్యాలు. ఇవి కొలవదగినవి. ఇవి చదివే సబ్జెక్ట్ లేదా కోర్సుకు సంబంధించిన నైపుణ్యాలు. అంటే వారు మాత్రమే ప్రత్యేకంగా కలిగి ఉండేవి. ఒక ప్రత్యేకమైన రీతిలో నిర్దేశింపబడినవి.

ఉదా: కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ నాలెడ్జ్, డేటా ఎనాలసిస్, మార్కెటింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, మనం చదివే సబ్జెక్ట్‌కు సంబంధించినవి.

#### 2. సాఫ్ట్ స్కిల్స్

ప్రొఫెషనల్ స్టూడెంట్స్ అయినా, గ్రాడ్యుయేట్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్స్, స్టూడెంట్స్ అయినా ప్రతి ఒక్కరికి ఇవి చాలా ప్రాముఖ్యమైనవి. చేస్తున్న ఉద్యోగంలో ఎక్సెల్ అవ్వాలన్నా ఇవి చాలా అవసరం. అంతేకాదు ఇతరులతో ఎలా కలిసి పని చేయాలి? ఏ సందర్భంలో ఎవరితో మాట్లాడాలి? ఎలా కూర్చోవాలి? ఎలా నిలబడాలి? సందర్భాన్ని బట్టి ఎలాంటి డ్రెస్ వేసుకోవాలి? ఎలా తినాలి? ఎంత లోతుగా ఆలోచించాలి? సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి? ఇవన్నీ సాఫ్ట్ స్కిల్స్ కిందకు వస్తాయి. ఇవి అందరిలో మనకు ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చి గౌరవానికి కారణమవుతాయి.

ఉదా: కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, సంఘర్షణ నిర్వహణ, సానుకూల వైఖరి, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, సివి ప్రిపేర్ చేయడం, హావాభావాల తెలివి, సమస్యా పరిష్కార నైపుణ్యాలు, నిర్ణయాలు చేయడం, ఎనలిటికల్ నైపుణ్యాలు, పబ్లిక్ స్పీకింగ్, టేబుల్ మేనర్స్, డ్రెస్ కోడింగ్ మొదలగునవి.

#### 3. భాషా నైపుణ్యాలు

ఆన్‌లైన్ పరీక్షల దగ్గర నుండి ఇంటర్వ్యూల వరకు అన్ని ఇంగ్లీష్‌తోనే ముడిపడి ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో కార్పోరేట్ వ్యవస్థలో మన ఇయు విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ ఫిట్ అవ్వకపోవడానికి ప్రధాన కారణం ఈ నైపుణ్యాలను అభ్యసించకపోవడమే.

ఉదా: వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం, వీటినే యల్ యస్ ఆర్ డబ్ల్యు అంటారు.

#### 4. జీవన నైపుణ్యాలు (లైఫ్ స్కిల్స్)

మానవ సంబంధాల్ని బలపరిచే నైపుణ్యాలు.

సాఫ్ట్ స్కిల్స్ మరియు జీవన నైపుణ్యాలు చాలావరకు కలిసి ఉంటాయి.

ఉదా: ఇంటర్ పర్సనల్ సంబంధ నైపుణ్యాలు, క్రిటికల్ థింకింగ్ స్కిల్స్, క్రియేటివ్ థింకింగ్ స్కిల్స్, విభిన్నంగా ఆలోచించే నైపుణ్యాలు, సామాజిక నైపుణ్యాలు, ఎంపతి, ఎమోషనల్ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు మొదలగునవి.

### 5. ఉపాధి నైపుణ్యాలు (ఎంప్లాయిబిలిటీ స్కిల్స్)

ఇవి చాలా ప్రాముఖ్యమైన నైపుణ్యాలు. మనం పని చేసే దగ్గర, ఉద్యోగం పొందడానికి అవసరమైనవి.

ఉదా: సాఫ్ట్ స్కిల్స్, నాయకత్వపు నైపుణ్యాలు, టీం వర్క్, పాలన, నిర్వహణ, టైం మేనేజ్‌మెంట్ స్కిల్స్, ఫ్లెక్సిబిలిటీ, కొత్తవాటిని నేర్చుకోవడం, చొరవ తీసుకొనే నైపుణ్యాలు మొదలగునవి.

### 6. కంప్యూటర్ నైపుణ్యాలు

మనం డిజిటల్ ప్రపంచంలో బతుకుతున్నాం. ఇప్పుడు అన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. అన్ని పోటీ పరీక్షలు ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నారు. కష్టమైనా ఇష్టంగా ఈ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలి. మన మెయిల్స్‌ని మనం చెక్ చేసుకుని పంపించగలగాలి. మన లెటర్స్‌ని మనం టైప్ చేసుకోగలగడం. బ్రౌజ్ చేయగలడం, కంప్యూటర్‌కి సంబంధించిన మినిమం నాలెడ్జ్ మనకు ఉండాలి.

ఈ నైపుణ్యాలన్నిటినీ చదివిన తర్వాత మనం ఎక్కడున్నామో మనకు అర్థం అవ్వాలి. ఇయు విద్యార్థులుగా, గ్రాడ్యుయేట్స్‌గా వీటిని అభివృద్ధి చేసుకోవాలి.

## బైబిల్ వీటి గురించి ఏమి చెబుతుంది?

2021 లెక్కల ప్రకారం ప్రపంచ జనాభా 788.84 కోట్లు. ఇన్ని కోట్ల జనాభాలో ఏ ఒక్కరి ఫింగర్ ప్రింట్స్, ఐరిష్ ఒకే విధంగా ఉండవు. ఎంత అద్భుతం! మన దేవుడు ఎంత సృజనాత్మకత గల వాడు! నైపుణ్యాలకు ఆధారం మన దేవుడే. యేసయ్య ఈ లోకంలో ఉన్నప్పుడు ఆయన వడ్రంగి వానిగా పనిచేశాడు. సామెతలు 22:29 ప్రకారం "తన పనిలో నిపుణత గలవానిని చూచితివా అల్పులైన వారి ఎదుట కాదు వాడు రాజుల ఎదుటనే నిలుచును". మనలో ఉన్న ప్రజ్ఞ, సామర్థ్యం, నైపుణ్యాలు రాజులు ఎదుట నిలిచేలా చేస్తాయి. యోసేపు, దానియేలు,



నెహెమ్యా వీరికి ఉన్న నైపుణ్యాలను బట్టి రాజుల ఎదుట నిలిచారు. 1 సమూయేలు 16: 17-18 ప్రకారం దావీదులో ఉన్న నైపుణ్యాల్ని బట్టి సౌలు రాజు దగ్గర ఉండగలిగాడు. అపో.కా. 7:22లో మోషే ఐగుప్తీయుల సకల విద్యలను అభ్యసించి, మాటల యందును, కార్యములయందును ప్రవీణుడై యుండెను. దానియేలు షద్రక్, మేషక్, అబెద్నెగోలు పరాయి దేశములో బానిసలుగా ఉండి పరభాషలో ప్రావీణ్యాన్ని సంపాదించారు. దానికి కారణం వారు దేవుని కొరకు కష్టపడడానికి ఇష్టపడ్డారు కాబట్టే దేవుడు వారికి సహాయం చేశాడు (దానియేలు 1:4, 17, 20; 5: 11-12). దేవుడే బెసలేలుకు, అహోలీయాబుకు ప్రజ్ఞ వివేక జ్ఞానం కలుగునట్లు దేవుని ఆత్మతో వారిని నింపి ఉన్నాడు.

## ముగింపు

ప్రియ తమ్ముడు, చెల్లీ, బైబిల్ గ్రంథంలో ఇలా ఎంతోమంది ఉన్నారు. వారి ప్రజ్ఞ జ్ఞాన నైపుణ్యాలను బట్టి రాజుల్ని, రాజ్యాల్ని, సమాజాన్ని ప్రభావితం చేశారు. అయితే ఈ నైపుణ్యాలు ఎప్పుడు శక్తివంతంగా ఉంటాయంటే ప్రభువుతో సహవాసం కలిగి ఆయనతో కలిసి మనం పయనించినప్పుడే. దేవుడు మనకు నైపుణ్యాల్ని అభివృద్ధి చేసుకొనే జ్ఞానం కూడా ఇస్తాడు. లూకా 5:1-11 ప్రకారం శిష్యులు రాత్రంతా చేపలు పట్టారు. చేపలు పట్టడంలో వారు స్కిల్‌ఫుల్ మరియు ప్రొఫెషనల్ కానీ, ఖాళీ పడవలతో శ్రమపడి బయటకు వచ్చారు. కానీ యేసయ్య మాట విని మరలా వలలు వేసినప్పుడు విస్తారమైన చేపలు పట్టారు. ఖాళీ వలలు చేపలతో నిండిపోయి వారు బయటకు లాగలేకపోయారు. మనకు నైపుణ్యం ఉన్నా దేవుని సహాయాన్ని, ఆయన నడిపింపును తప్పకుండా కోరుకోవాలి. అప్పుడు మనంచేసే పనిలో రాణిస్తాము. 1 కొరింథీ 10:31 ప్రకారం "కాబట్టి మీరు భోజనం చేసినను పానము చేసినను సమస్తమును దేవుని మహిమ కొరకు చేయుడి".

**- డా. యం. సాల్మన్ రాజు,** వైజాగ్



# ఇది నాకు చాలా పర్సనల్

ఇషా, ఇషా...అని అరుస్తున్న భర్త కేకలతో ఉలిక్కిపడిందామె. అప్పుడే ఆఫీసునుంచి వచ్చిన భర్త కళ్ళల్లోకి భయంగా చూసింది. కోపంతో ఎర్రబడిన ఆయన ముఖం, ఏదో జరగకూడనిది జరిగినట్లు స్పష్టంగా చెప్తుంది. ఇషా భర్త గబ గబా కంప్యూటర్‌లో ఇంటర్నెట్ ఓపెన్ చేసి పోర్న్ వెబ్‌సైట్ అడ్రస్ కొట్టాడు. అక్కడ నగ్నంగా ఉన్న ఇషా ఫొటో చూసి తన కళ్ళను తానే నమ్మలేక అయ్యో!! అని గట్టిగా అరిచింది. అప్రయత్నంగా తన నోటి నుండి వచ్చిన మాటలకు నిద్రనుంచి మెలుకువ వచ్చేసింది. రాత్రి 2 గం॥లు అయ్యింది. ఒళ్ళంతా చెమటలు పట్టి వణకుతూ ఉంది. గుండె వేగంగా గట్టిగా కొట్టుకొంటుంది. జరిగింది కల అని తెలిసినా, జరగబోయేది అదేనేమోనని చేతుల్లో ముఖం పెట్టుకొని వెక్కి వెక్కి ఏడ్చింది ఇషా.

❉ ❉ ❉

రెండు సంవత్సరాల క్రితం జరిగిన ఉదంతం కళ్ళకు కట్టినట్లు జ్ఞాపకం వస్తుంది. హైదరాబాద్‌లో ఓ ఇంజనీరింగ్ కాలేజీలో ట్రిపుల్‌ఇ రెండో సంవత్సరం చదువుకొంటున్న తనకు ఇయుని పరిచయం చేసింది తేజస్వి. అక్క ఎంతో ప్రేమగా మాట్లాడేది. సబ్జెక్ట్స్ అర్థమవుతున్నాయా లేదా అని వాకబు చేసేది. కష్టపడి చదువుతూ, దేవునికి మహిమ తేవాలని చెప్పేది. అక్క జీవితం తనకు గొప్ప సవాలుగా ఉండేది. నాన్నగారు కొనిచ్చిన కొత్త స్మార్ట్ ఫోన్‌లోని ఫీచర్స్ గురించి రూమ్మేట్ సమీర చెప్పకపోతే ఏమీ తెలిసేదే కాదు, నోరెళ్ళబెట్టి చూడడం తప్ప. కానీ వారం తిరిగేటప్పటికే వాట్సప్, ఫేస్‌బుక్ అకౌంట్స్ ఓపెన్ చెయ్యడం, లైక్స్ కొట్టడం, చాట్ చెయ్యడం కొట్టిన పిండి అయిపోయాయి. ఇయులో మిగిలిన వారిని చూస్తున్నప్పుడు కొంచెం చిరాకు కూడా వేసేది. ఎప్పుడూ బైబిల్, క్వయిట్ టైమ్, విద్యార్థి గీతావళిలోని పాటలు ఇవే లీజర్ టైమ్‌లో వీళ్ళ సరదాలు అని అనుకునేది. కొంచెం లోకం గురించి, సమాజంలో జరుగుతున్న మార్పులు, ట్రెండ్స్, మనుష్యులు గురించి కూడా తెలుసుకోవాలి గదా అని అనుకునేది.

ఆదివారం సాయంత్రం అమ్మవాళ్ళతో కబుర్లు చెప్పి ఫోన్ అలా పెట్టి మంచం మీద రిలాక్స్ అవుతున్న ఇషాకి టింగ్, టింగ్ మని ఫోన్‌లో మెసేజ్. అప్రయత్నంగా ఓపెన్‌చేసి చూసింది. ఎవరో ఫేస్‌బుక్‌లో 'గుడ్ ఈవినింగ్ బ్యూటీ' అనే మెసేజ్ చేశారు. 'నాకు తెల్సులేరా నేను అందంగా ఉంటానని, నీవు చెప్పనక్కర్లేదు' అనుకొని పెట్టేసింది. రాత్రి 10గం॥లకు మళ్ళీ అదే వ్యక్తి నుంచి 'గుడ్‌నైట్' అంటూ మెసేజ్ వచ్చింది. మనస్సులో ఎవరైయుంటారనే ఆసక్తి మొదలైందికానీ ఇలాంటివి మామూలే అనుకుంది. రెండు రోజులు గుడ్ మార్నింగ్, గుడ్‌ఈవినింగ్‌లు కొనసాగాయి. ఇషా, ప్రొఫైల్ ఫొటో ఓపెన్ చేసి చూసింది. ఎవరో కుర్రాడు బాగానే ఉన్నాడు. ప్రొఫైల్ డిటైల్స్‌లోకి వెళ్ళి చూసింది. ప్రక్క ఇంజనీరింగ్ కాలేజీలో ఎమ్‌టెక్ అట, పేరు పాల్. ఫర్వాలేదు మనోడే అనుకుంది.

హాస్టల్లో బాయ్‌ఫ్రెండ్ లేని అమ్మాయి లేదు. అందరూ చాలా ఫ్రీగా ఛాట్ చేస్తారు, ఫొటోలు ఎక్చేంజ్ చేసుకొంటారు. తనకూ ఒక బాయ్‌ఫ్రెండ్ ఉంటే బాగుండు అని ఎన్నోసార్లు అనుకొంది. కానీ అమ్మ మాటలు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా భయం వేసేది. మనం డిఫరెంట్, మన దేవుడు డిఫరెంట్.

ఆయనకు కోపం వచ్చే పనులు చేస్తే అది మన జీవితానికెంతో నష్టం అని చెప్పేది అమ్మ.

మర్నాడు గుడ్ మార్నింగ్ అని ఎర్రగులాబీ బొమ్మతో మెసేజ్ వచ్చింది. తనకు తెలియకుండానే గుడ్ మార్నింగ్ అని టైప్‌చేసి పంపింది. ఇలా ప్రారంభమైన పరిచయం ఛాట్స్, ఫొటోలు, కలుసుకోవడాలు దాకా వెళ్ళింది. రాత్రి 11 గం॥లకు ప్రారంభమైన ఛాటింగ్ చాలా సేపు కొనసాగేది. ఇక ముద్దుల ఫొటోలు, హద్దులు దాటిన మాటలు, అప్పుడప్పుడు పెళ్ళి గురించిన అభిప్రాయాల దాకా వెళ్ళడం జరిగిపోయాయి. రూమ్మేట్ సమీర చాలా సార్లు వారించినా ఇషా వినలేదు. ఇయు అక్కతో బైబిల్ స్టడీకి వెళ్ళేది, ప్రార్థన చేసుకునేది. ప్రార్థనలో ఈ అంశం ఎప్పుడూ ప్రస్తావించలేదు. ఎందుకంటే ఇది నాకు చాలా పర్సనల్ అనుకొనేది ఇషా.

రెండో శనివారం సెలవు కాబట్టి సమీర ఇంటికి వెళ్ళింది. ఇషా లైబ్రరీకి వెళ్ళి ఎసైన్‌మెంట్ పూర్తిచేసి లంచ్ తీసుకుని రూమ్‌కి వచ్చి బెడ్‌మీద అడ్డంగా పండుకుంది. ఫేస్‌బుక్ సిగ్నల్ మ్రోగింది. ఒక్కసారిగా లేచి ఓపెన్ చేసింది. తన బాయ్‌ఫ్రెండ్ పాల్ ఛాట్ చేస్తున్నాడు. "డార్లింగ్ కిస్ యు" అనే మెసేజ్‌కి "ఐటూ" అని రిప్లై ఇచ్చింది. సంభాషణ చాలా ఘాటుగా వేడిగా శ్రుతి మించి సాగుతుంది. సడన్‌గా పాల్ నుండి ఎప్పుడూ రాని రిక్వెస్ట్ వచ్చింది. "ఐ వాంట్ టు సీయు నౌ, మామూలుగా కాదు బట్టలు లేకుండా" "ఛీ సిగ్గులేదూ" అని రిప్లై ఇచ్చింది. నాకు లేదు అని తన న్యూడ్ ఫోటో పంపించాడు. ప్లీజ్..ప్లీజ్.. అని రిక్వెస్ట్ మీద రిక్వెస్ట్‌లు. నాకు సిగ్గు అని కొంచెం మెత్తబడింది ఇషా. కొంచెం కొంచెంగా పంపడానికి సిద్ధపడింది. ఒకసారి చేసిన తర్వాత మళ్ళీమళ్ళీ చేయడం కష్టంగా అనిపించలేదు.

రోజులు గడుస్తున్నాయి. కాలేజ్ యూత్ ఫెస్ట్‌లో సమీర పాల్‌వాళ్ళ కాలేజ్ అమ్మాయిని పరిచయం చేసింది. మాటలలో నెమ్మదిగా "పాల్ అనే ఎంటెక్ అబ్బాయి గురించి తెలుసా?" అని అడిగింది. "ఎందుకు? వాడంత మురికి వాడు ఇంకొకడు ఉండడు. వాడికి అమ్మాయిల పిచ్చి. ఇప్పటికి ఎంతమందిని మార్చాడో అంది". ఇషాకి ఆ తర్వాత మాటలు రాలేదు. మనసు మనసులో లేదు. ఎప్పుడు రూమ్‌కి వెళ్ళి పాల్‌తో మాట్లాడాలా అని ఎదురు చూస్తుంది. ఫెస్ట్ అయిపోయేటప్పటికి రాత్రి 10 గంటలు అయ్యింది. రూమ్‌కి వెళ్ళి హడావిడిగా ఫోన్ చేసింది వణుకుతున్న చేతులతో. ధైర్యం చేసి పాల్‌తో తను విన్న విషయం నిజమేనా అని అడిగింది. పాల్ ఏమీ దాచలేదు. చాలా క్యాజువల్‌గా.."అందరిలో నీవు కూడా ఒక దానివే" అని నిర్మొహమాటంగా చెప్పాడు. ఇషాకు ఏడ్వాలో నవ్వాలో అర్థంకాలేదు. గట్టిగా వెర్రిదానిలా అరుస్తూ "నా ఫొటోలు అన్నీ డిలీట్ చేసెయ్ లేకపోతే పోలీసు కేసు పెడతాను అంది". "పెట్టు చూద్దాం, నీ ఫొటోలు ఇంటర్నెట్ అంతా సంచారం చేయిస్తా. నా సంగతి నీకు తెలియదు. నిన్ను నా కాళ్ళదగ్గరకు తెచ్చుకోవటం ఎలానో నాకు బాగా తెలుసు. నా ఎకౌంట్ నంబర్ పంపిస్తున్నాను. దానిలో 5000/-రూపాయలు డిపాజిట్ చేయి. లేకపోతే మీ నాన్నకు నీ ఫొటోలు వెళ్తాయి" అన్నాడు. "పాల్...ప్లీజ్..ప్లీజ్ ఆ పని చెయ్యకు నీ కాళ్ళు పట్టుకొంటాను" అని ఫోన్ ప్రక్కన పెట్టేసి వెక్కి వెక్కి ఏడ్వసాగింది ఇషా. ఎప్పుడు నిద్రలోకి జారిపోయిందో తెలీదు, ఓ కలవచ్చి ఉలిక్కిపడి లేచింది. సమీర గాఢనిద్రలో ఉంది. కళ్ళనుండి నీళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి. ఎవరితో పంచుకోవాలి ఈ గుండె కోతను? ఎవరు ఓదారుస్తారు? ఎవరు ఈ పరిస్థితి నుంచి తప్పిస్తారు? అందరికీ తెలిసిపోతే...అమ్మో తలచుకోవడానికే భయంగా ఉంది. గట్టిగా దేవా క్షమించు అని అరవాలనిపిస్తుంది.

జీవితంలో తప్పులు చేయడానికి అవకాశాలు పుష్కలంగా అందుబాటులో ఉంటాయి. అవి చేస్తున్నప్పుడు ఎంతో ఆహ్లాదంగా ఉన్నట్లు అనిపిస్తుంది. కానీ వాటి పర్యవసానాలు చాలా భయంకరంగా ఉంటాయని తెలియదు. కానీ దైవగ్రంథం చాలా స్పష్టంగా 'నీ పాపము నిన్ను పట్టుకొనును' అని ఘోషిస్తుంది. ఆకాను లాంటి యౌవనస్తుడు, ఎవరికీ తెలియదని అనుకున్న పాపం ఇశ్రాయేలీయులందరికీ, ఆ తర్వాత ప్రపంచమంతటికి తెలిసిపోయింది. ఎవరికీ తెలియదు, తెలియకూడదు అనుకున్న దావీదు పాపం అందరికీ తెలిసిపోయింది. ప్రియ విద్యార్థీ ఫేస్‌బుక్ మూసేసి 'ది బుక్' అయిన బైబిల్ తెరువు. అక్కడే నీ అసలు రూపం, నీ అసలు వ్యాధి తెలుసుకో. అక్కడే నీకు కావలసిన సరైన పరిష్కారం, సరైన దాగుచోటు లభిస్తాయి. యేసుప్రభువు దగ్గర యధార్థంగా నీ పాపం ఒప్పుకొని క్షమాపణ అడిగి ఆయనలో నీ భద్రతను అనుభవించు.

**– కె. దేవిడ్ రాజ్‌కుమార్,** గుంటూరు



థాట్ ఫర్ ద మంత్

# కృంగిపోవద్దు

## కృంగిపోవడం అంటే ఏంటి?

ఇది మనసుకు సంబంధించిన మాట. "మనసు అనేది స్వర్గాన్ని నరకంగాను, నరకాన్ని స్వర్గంగాను మార్చగలదు" అని అంటాడు జాన్ మిల్టన్. మన మనసు ఉండాల్సిన సాధారణ పరిస్థితి నీతి, సమాధానము, పరిశుద్ధాత్మ యందలి సంతోషముతో ఉండడం (రోమా 14:17). అలా ఉండనప్పుడు మనకు కలిగే మానసికమైన స్థితిని కృంగిపోవడం అని అంటారు.

## కృంగిపోవడానికి కారణాలు

1 థెస్స 5:23 ప్రకారం మానవుడు ఆత్మ, ప్రాణము, శరీరముల కలయికని అర్థమవుతుంది. గనుక మనలో వచ్చే కృంగుదలకు ఆత్మీయ, మానసిక, శారీరక కారణాలు ఉంటాయి.

మనకు అనారోగ్యం సంభవించినప్పుడు, అనుకోని సంఘటనలు, అపాయాలు, నష్టాలు సంభవించినప్పుడు, అనుకొన్నవి జరగనప్పుడు, ఇరుకులు, ఆర్థిక అవసరతలు వచ్చినప్పుడు, ఉద్యోగం రానప్పుడు, ఉన్న ఉద్యోగం పోయినప్పుడు, మరణాలు సంభవించినప్పుడు, దిక్కు లేనప్పుడు, దిక్కు తోచనప్పుడు మన జీవితంలో కృంగుదల సంభవిస్తుంది. విద్యార్థులకైతే పరీక్షల్లో ఫెయిల్ అయినప్పుడు, స్నేహితులు లేనప్పుడు, స్నేహితులు ఎగతాళి చేసినప్పుడు, తోటి వారు, తోబుట్టువులు, 'నా' అనుకొనేవారు ఒంటరిగా విడిచినప్పుడు, పెళ్ళి కానప్పుడు, పిల్లలు కలగనప్పుడు, దేవుడు పట్టించుకోవడం లేదు, దేవుడు నా ప్రార్థన వినడం లేదు, దేవుడు మనలను మరిచిపోయాడు అని అనిపించినప్పుడు, దేవుడు ఏమయ్యాడు అని అనిపించినప్పుడు, అపరాధ భావన ఎక్కువైనప్పుడు, దేవుడు నా పాపమును క్షమించలేదని అనిపించినప్పుడు మన ప్రాణం కృంగిపోతుంది (కీర్తన 42:11).

## పర్యవసానాలు

ఇలాంటి పరిస్థితుల్లో దిగులు, విచారం, కలవరం, అనుమానం, భయం, జడుపు, చింత మనలను ఆవరిస్తాయి. వాటి వైపే చూసే కొద్దీ, వాటిని గురించి ఆలోచిస్తూ మాట్లాడే కొద్ది అవి విపరీతంగా పెరిగి పెను తుఫానులుగా, భూతాలంగా అవుతాయి. అప్పుడు మనం కూర్చోలేము, నుంచోలేము, నిద్రపోలేము, భయంతో తల్లడిల్లిపోతాము. మన మనసులో సమాధానం, స్థిమితం లేని వారం అవుతాము. దేని మీదా పూర్తిగా దృష్టి నిలుపలేము. అందువలన మతిమరుపు ఎక్కువవుతుంది. నేను ఎందుకూ పనికిరాను, ఎవరికీ ఉపయోగపడను, నేను బ్రతకడం వ్యర్థమనే ఆలోచనలు ఎక్కువై ఆత్మహత్యా ప్రయత్నాలు చేస్తారు. ఇటీవల యంబిబియస్ అమ్మాయి పిజి సీట్ రాలేదని ఉరివేసుకొని చనిపోయింది. ఇలాంటి ఆలోచనలు, ప్రవర్తనలు అనేకుల జీవితాలను నశింప చేస్తున్నాయి. నెగిటివ్ మైండ్ సెట్ లోకి, నెగిటివ్‌గా విపరీత ఆలోచనలోకి దారి తీసినప్పుడు దారుణమైన ఫలితాలు మనం చూస్తుంటాము. అంతేకాదు ఈ ఆలోచనలు దేహంలో అనేక మార్పులను తెస్తాయి. బీపీ, షుగర్, గ్యాస్, హృదయ సంబంధమైన వ్యాధులు పెరగడం వెనక ఇలాంటి నెగిటివ్ మైండ్‌సెట్ ఉందని శాస్త్రపరంగా, వైద్యపరంగా రుజువు చేయబడింది.

## పరిష్కారం ఏంటి?

### 1. దేవుని వాక్యము

సామెతలు 4:20-23 ఈ వాక్య భాగంలో దేవుని వాక్యం మన సర్వ శరీరానికి ఆరోగ్యాన్ని ఇస్తుంది గనుక మనం దేవుని మాటలను ఆలకించడం

నేర్చుకోవాలి. వేరే మాటలకు ప్రాముఖ్యత ఇవ్వక దేవుని వాక్యాన్ని మనం ఆచరణలోకి తీసుకోవాలి. మన పూర్తి శ్రద్ధ వాక్యం మీద (కీర్తనలు 1 అధ్యాయం), వాక్య ధ్యానం మీద ఉంచినప్పుడు వాక్యం మన ప్రవర్తనలో మార్పు తెస్తుంది (ఫిలిప్పీ 2:5-11).

నా వాక్యమునకు చెవియొగ్గుము అంటే వాక్యానికి లోబడుము అని అర్థము (సామెతలు 3:5-8). వాక్యం నీ ప్రవర్తనను సరిదిద్దనివ్వు. వాక్యం ఆయా విషయాలలో ఏమి చెబుతుందో చూసుకొని దానికి లోబడితే మనం ఆశీర్వదించబడతాము, స్వస్థపరచబడబడతాము. సువార్తలలో ప్రభువు అందరిని స్వస్థపరచినట్లు లేదు. ఆయన మీద, ఆయన మాట మీద ప్రజలకున్న విశ్వాసాన్ని బట్టి స్వస్థపడ్డారు అని చదువుతాము. అందువలన వాక్యాన్ని బాగా చదవాలి, ధ్యానించాలి, నమ్మాలి, అనుసరించాలి. అప్పుడు ఆ వాక్యం ఇచ్చే శక్తిని అనుభవిస్తాము.

ఒకవ్యక్తి పాస్టర్ గారితో నేను మూడు వారాల నుంచి చర్చ్‌కి వస్తున్నా నా కుంటితనం పోవడం లేదు ఎందుకని అని అడిగాడట. అప్పుడు ఆ పాస్టర్‌గారు నీవు అందరితో సమాధానంగా ఉంటున్నావా? అని అడిగాడు. అతను అందరితో సమాధానంగా ఉంటాడు గానీ ఏదో కారణాన తన అక్కతో సమాధానంగా ఉండడంట. అయితే నీవు వెళ్లి మీ అక్కతో సమాధాన పడిరా ప్రార్థిద్దాం అన్నాడు. వాళ్ల అక్కతో సమాధాన పడిన వెంటనే అతనికి స్వస్థత కలిగింది. గనుక మనకు వచ్చే రోగాలు వెనక మన భక్తిహీనమైన, శరీర సంబంధమైన, అవిశ్వాస పనులు, ఆలోచనలు, మాటలు ఉంటాయి. మనలో ఏదైనా రోగం, భయం, అనుమానం కలిగినప్పుడు వాక్య ప్రకారం మన ప్రవర్తన సరిపోతుందా, ఎలా ఉన్నదో పరీక్షించుకోవాలి. కాలేబు యొక్క రహస్యం దేవుని మాట నమ్మడం, వెంబడించడం అని చెప్పాడు (యెహోషువ 14:8). “నేను నా దేవుడైన యెహోవాను నిండు మనసుతో అనుసరించితిని” అని అన్నాడు. గనుకనే 85 సంవత్సరాలప్పుడు కూడా 40 సంవత్సరాల వ్యక్తివలె బలం కలిగి ఉన్నాడని చెప్పాడు. మోషేను గూర్చి ద్వితీ 34:7లో అతనికి దృష్టి మాంద్యము లేదు, అతని సత్తువ తగ్గలేదు అని ఉంది.

నిర్గమకాండం 15:26ను బట్టి మన స్వస్థత, ఆరోగ్యము దేవుని వాక్యాన్ని శ్రద్ధగా విని ఆయన దృష్టిలో న్యాయమైనవి చేసి, ఆయన ఆజ్ఞలకు విధేయులై, ఆయన కట్టడలన్నిటిని అనుసరించిన యెడల... ఈ రోగములలో ఏదియు మనకు రాదని, మనలను స్వస్థపరచేవాడు యెహోవాయేనని మనకు అర్థమవుతుంది.

## 2. ప్రార్థన

ఫిలిప్పీ 4:6,7 వచనాలలో దేనిని గూర్చి చింతపడకుడిగాని ప్రతి విషయంలోనూ ప్రార్థన విజ్ఞాపనముల చేత కృతజ్ఞతాపూర్వకంగా మీ విన్నపములు దేవునికి తెలియజేయండి (అప్పగి ంచండి అని అర్థము). అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తు వలన మీ హృదయములకును, మీ తలంపులకును కావలి ఉండును. అది ఎంత గొప్ప సమస్య అయినా, చిన్న సమస్య అయినా కానుక పెట్టెలో కానుక వేసి మర్చి పోయినట్లు మర్చిపో అని వాక్యం సెలవిస్తుంది. దేవుని సమాధానము మీ తలంపులకు (ఆలోచనలకు) కావలి ఉంటుంది కాబట్టి సమ-స్యలతో చిక్కుకొందామా? ప్రభువుకు అప్పగించి విడుదల పొందుదామా? కొంతమంది సమస్యను దేవునికి ఇచ్చినట్లు ఇచ్చి మరల దానిని మోసుకొని పోతారు. అలాగు ఉండకూడదు. దేవునికి ఇచ్చి వేసి ఆయన చూసుకొంటాడనే విశ్వాసం కలిగి ఉండాలి. అబ్రాహాము తన అత్యధికమైన సమస్యల్లో కృంగిపోక ‘యెహోవా యీరే’ అన్నాడు (ఆది 22వ అధ్యాయం). రెండవ దిన 20వ అధ్యాయంలో యెహోషాపాతు తన జీవితంలో అత్యధికమైన కష్టాన్ని ఎదుర్కొన్నాడు. అతడు ఉపవాస ప్రార్థనతో, దేవుని సజీవ వాక్యముతో ఆ పరిస్థితి అంతటినీ ఆహ్లాదకరమైనదిగా మారేటట్లు చేశాడు. ఆ శ్రమ వారి జీవితంలో గొప్ప ఆత్మీయ, మానసిక, భౌతిక ఆశీర్వాదములతో నింపినది. ఆ లోయ పేరే బెరాకా లోయ, స్తుతి లోయగా మార్చి వేయబడినది. గనుక నీ కృంగుదల నీకు, నీ తోటి వారికి ఆశీర్వాదం తెచ్చేదిగా ఉండాలంటే అపోస్తులుల కార్యములు 16లో ఫిలిప్పీ జైలులో పౌలు, సీలలు చేసిన పని, అబ్రాహాము యెహోషాపాతు చేసిన పని చేయాలి.

మనం కృంగిపోయే వారంగా ఉండక అత్యధిక విజయం పొందే వారముగా ఉందుము గాక! (రోమా 8:37).

**– డా. టి జోసఫ్,** మచిలీపట్నం

# కోశాధికారి లేఖ

## మన పరిచర్యకు మనమే ఇవ్వాలి

క్రీస్తునందు ప్రియమైన యుఇయస్ఐ-ఏపిలోని కోశాధికారులందరికి, సభ్యులకు
మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు నామములో శుభాకాంక్షలు.

"పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును" - మత్తయి 7:11

మన తండ్రి ఎంతో ప్రేమగలవాడు, దయగలవాడు. మంచివాటిని మనకిస్తూ మన మేలు కోరే దేవుడు. తనకు నిజముగా మొరపెట్టువారికి సమీపముగా ఉంటూ మన ప్రార్థనలు ఆలకించేవాడు. మన అవసరాలన్నీ తీర్చేవాడు. గనుక ఆయన సన్నిధిలో క్రమంగా మన ప్రతి అవసరం నిమిత్తం పట్టుదలతో ప్రార్థిద్దాం.

మన పరిచర్య ప్రార్థనాపూర్వకంగా ఆరంభించబడినది. ప్రార్థన అనే పునాది మీద కట్టబడిన పరిచర్య. ఈ పరిచర్యలో అవసరాలు మనకు కనబడిన్నప్పుడు అనేకులు వారి అవసరాలు పక్కన పెట్టి దేవుని పనికి ప్రాధాన్యత నిచ్చారు. కనుకనే పరిచర్య ఎంతో విస్తరించింది. విశ్వాసంతో కొనసాగుతూ ఉంది. విద్యార్థుల మధ్య జరిగే ఈ పరిచర్య మన పరిచర్య. మన పరిచర్యకు మనమే ఇవ్వాలి. మనము ఇవ్వకపోతే ఎవరు ఇస్తారు? సంతోషంగా, ప్రార్థనాపూర్వకంగా, హృదయపూర్వకంగా, సంపూర్ణ సమర్పణతో ఇవ్వాలి. అలాగే మన పరిచర్య అవసరాలు అడిగి తెలుసుకోవాలి. విద్యార్థిగా ఉన్నప్పుడే ప్రభువుకు ఇవ్వడం నేర్చుకొంటేనే గ్రాడ్యుయేట్ అయిన తర్వాత కూడా ఇవ్వగలము.

"దేవుని కొరకైనా, మనుష్యుల కొరకైనా ఎవరైనా చేయదగిన అత్యుత్తమమైన గొప్పపని ప్రార్థన చేయడం ఒక్కటే" అని చెప్పిన యస్.డి. గోర్డాన్ గారి మాటలను జ్ఞాపకం చేసుకొంటూ మన ప్రతి అవసరం కొరకు ప్రభువు సన్నిధిలో ప్రార్థిద్దాం. అడుగువాటికంటే ఊహించువాటికంటే అత్యధికంగా చేయశక్తిగల దేవునిపై ఆధారపడుతూ ప్రభువును మహిమపరుద్దాం. ప్రభువు ఇచ్చే ఆశీర్వాదాలు పొందుకొందాం.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి
2. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు ఇవ్వడానికి అవసరమైన రూ.1,00,000/- వచ్చిన దాన్ని బట్టి
3. బిల్డింగ్ ఫండ్‌కు వచ్చిన 8 లక్షలను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2023 తర్వాత పెరిగిన 18% బడ్జెట్‌కు అనుగుణంగా ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపేటట్లు
2. స్టెరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఇయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించింది. దీని అవసరత ప్రతి నెల రూ. 70,000/- పెరుగుతుంది.

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు

**యస్.ఆర్.డి. కిషోర్ కుమార్**

**Average monthly need of UESI AP: Rs.13,87,000/- (as per the ACM 2023)**
**Minimum amount to be sent to UESI every month: Rs.4,50,000/-(as per the ACM'23**
**Total Monthly need for the month of Sep'2023: Rs.18,37,000/- as per the Budget 2023**

### AUGUST - 2023

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | --- | Field Staff Salaries | 5,25,903.00 |
| General Fund | 15,20,325.00 | Field Staff HRA, CA, MA & TA | 3,01,078.00 |
| Staff Support | 5,200.00 | Office Staff Salaries | 1,66,948.00 |
| Adjusted from other funds(4.18%) | 75,654.00 | UESI | 4,50,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | Punjab | 10,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Girls Depatment | 3,500.00 |
| | | To Gratuity | 50,000.00 |
| | | Other Expenditure | 45,750.00 |
| **Total** | **16,01,179.00** | | **16,01,179.00** |

**Note:**


1. Rs.75,654/- less was received than the actual expenditure for the month of August'2023 which is 4.18%
2. Rs. 15,20,947/- is received as on 20/09/2023 againast the Total need of Rs.18,37,000/- for the month of Sep'23 which is 59.36% only
3. Projected Budget for the month of October'23 Rs. 18.37 Lakhs
4. Percentage of hike that all the EUs & EGFs are requested to do for their last years' monthly contribution: 17.95%

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-09-2023**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508

# నా ప్రయాణం



గ్రేట్ అనిపించుకోవడమెలా?
అని పరధ్యానంగా ఆలోచిస్తూ
అలా పాతనిబంధన వీధుల్లో
నడుస్తూ ఉన్నా..
విశ్వాస వీరులందరూ ఒకచోట చేరి
మాట్లాడుకోవడం చూశా
ఒక్క అడుగులో దగ్గరకెళ్ళి పలకరించా
సముద్రాన్ని రెండుగా చీల్చారు
సూర్యచంద్రుల్ని ఆపారు
సింహాల నోళ్ళు మూయించారు
ఇంకా నా ఊహకందనివెన్నో చేశారు
ఎలా సాధ్యమైందని అడిగా
చరిత్ర చదవలేదా?
చెప్పేవైనా వినలేదా?
నిస్వార్థంగా ప్రార్థించాం
యెహోవా నీవే మా దిక్కని వేడుకొన్నాం
అద్భుతాలెన్నో కళ్ళారా చూశాం!

ధన్యవాదాలు చెప్పి మలుపు తిరిగా
అది కొత్త నిబంధన దారి
గెత్సెమనే దాటుతుంటే
రక్తంగా మారిన చెమట చుక్కలు కన్పించాయి
నాకోసం నా ప్రియుడు పడిన
వేదన గుర్తుకు వచ్చి
మనసంతా భారమైంది
అదే మార్గంలో నడక సాగింది
అపొస్తలులు భక్తులందరూ
మేఘంలా నన్ను ఆవరించారు
అడిగినవన్నీ పొందారు
ఆశ్చర్య కార్యాలెన్నో చేశారు ఎలా?
సందేహం వెలిబుచ్చా!
అది కూడా తెలియదా
అన్నట్టు చూశారు
అడగండి ఇస్తాను అన్న వాగ్దానం
నమ్మలేదా?
ఆవగింజంత విశ్వాసం
కొండను కదిలిస్తుందని వినలేదా?
అని నిలదీశారు
మెల్లగా అక్కడ నుంచి తప్పుకొన్నా..

వారిలా నేనెప్పుడు
ప్రార్థన చేస్తానో అనుకొంటూ..
బరువెక్కిన గుండెతో
బాటలో నడుస్తున్నా
ఎక్కడి నుంచో మూలుగులు
అవి చెప్పడానికి శక్యం కానివి
ఎవరో అనుకొంటూ
అటువైపు దృష్టి సారించా
అక్కడ...
పరిశుద్ధాత్మ దేవుడు
నా కోసమే ఏడుస్తూ
ప్రార్థన చేస్తున్నాడు
ఆ ప్రేమకు స్పందనగా
ఆయన పాదాల దగ్గర ప్రణమిల్లాను
కన్నీటితో మోకరించాను.

– **గొంగటి మేరిజాయ్**, ఆదోని